మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...



PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com



మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..



బుధవారం WEDNESDAY 3-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 335 Issue: 335

03 జూన్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:44 సూర్యాస్తమయం - సా. 6:43 తిథి తదియ రా. 9:20 వరకు తరువాత చవితి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం పూర్వాషాఢ రా. 12:51 వరకు తరువాత ఉత్తరాషాఢ యోగం శుభ ఉ. 8:03 వరకు కరణం వనిజ ఉ. 8:12 వరకు విష్టి రా. 9:20 వరకు వర్జ్యం ఉ. 8:51 నుండి ఉ. 10:39 వరకు దుర్ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:40 వరకు రాహుకాలం మ. 12:14 నుండి మ. 1:51 వరకు యమగండం ఉ. 7:22 నుండి ఉ. 8:59 వరకు గుళికాకాలం ఉ. 10:36 నుండి మ. 12:14 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:08 నుండి తె. 4:56 వరకు అమృత ఘడియలు రా. 7:36 నుండి రా. 9:23 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial


తెలంగాణ సమాజం కోరేది స్వాభిమానం

# సజీవం.. తెలంగాణ స్వరం



## భావోద్వేగంతో రాజకీయ ఆటలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దం దాటినా, తెలంగాణ భావోద్వేగం మాత్రం ఇంకా సజీవంగానే ఉంది. రాజకీయంగా బీఆర్ఎస్ బలహీనపడిందనే కారణంతో తెలంగాణ వాదం కూడా బలహీనపడిందని భావించడం రాజకీయ పార్టీల పెద్ద పొరపాటుగా మారుతోంది. ముఖ్యంగా తెలంగాణ బీజేపీ నేతలు ఆంధ్రప్రదేశ్ కూటమి నేతలను అతిగా పొగడటం, వారితో రాజకీయ అనుబంధాలను ప్రదర్శించడం తెలంగాణ సమాజంలో అసంతృప్తికి కారణమవుతోంది. తెలంగాణ ఉద్యమం కేవలం ఒక పార్టీకి చెందినది కాదు, కోట్లాది ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అనే విషయాన్ని రాజకీయ నాయకులు విస్మరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### అధికారాల కోసం కొత్త అనురాగాలు

### అభివృద్ధి, సంక్షేమం పక్కనబెట్టి కుట్రలు

### ప్రజల్లో పార్టీల తీరుపై ఆగ్రహ జ్వాలలు

(ఈవార్తలు – స్పెషల్ డెస్క్)

తెలంగాణ ఉద్యమం చరిత్రను, ఆ ఉద్యమం వెనుక ఉన్న భావోద్వేగాన్ని మరచిపోయి రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తున్న నాయకులపై తెలంగాణ వాదుల్లో అసహనం పెరుగుతోంది. ఒకప్పుడు ఆంధ్రా ఆధిపత్యాన్ని ప్రశ్నించిన నాయకులే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకులను భుజానికెత్తుకోవడం, వారిని తరువాయి 2 వ పేజీలో...





# ప్రజల మనోభావాలకు ప్రతినిధులం

## సమాజ ఆకాంక్షలకు మేం వారధులం

### మేం పాలకులం కాదు.. సేవకులం.. ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్

తెలంగాణ రాష్ట్ర ప్రజల మనోభావాలకు తాము ప్రతినిధులమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. సంక్షేమం, అభివృద్ధికి ఈ ప్రభుత్వం సమప్రాధాన్యం ఇస్తోందని సీఎం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహానుభావుల త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తి ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొంటూ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

హైదరాబాద్, జూన్ 2 (ఈవార్తలు): ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను సాకారం చేసుకుని తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణను సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలనను అందిస్తూ, ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుక సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ ఐక్యంగా, సౌభ్రాతృత్వంతో ముందుకు సాగుతూ తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. 'తెలంగాణ స్వరాష్ట్ర అస్తిత్వం తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,704 |
| వెండి (కిలో): | రూ.2,90,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,851 |

# తెలంగాణ మీ అయ్య జాగీరా?

### కష్ట కాలంలో నా వెన్నంటి ఉన్నది తెలంగాణే

### వారాహికి అనుమతిచ్చింది తెలంగాణ సర్కారే

### ఆంధ్రాలోనే దిక్కులేదు.. ఇక్క సీఎం అవుతానా?

### ఏపీ డిప్యూటీ సీఎం పవన్ ఆసక్తికర వ్యాఖ్యలు

### జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జనసేన పోటీపై ప్రకటన



హైదరాబాద్, జూన్ 2 (ఈవార్తలు): జనసేన తలపెట్టిన 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ–జనసేన సాధక్ సమ్మేళనం' సభకు తెలంగాణ పోలీసులు, హైకోర్టు అనుమతి నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జనసేన అధినేత , ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



# బరాబర్ మా అయ్య జాగీరే

### పవన్‌కు మంత్రి పొన్నం కౌంటర్


మిస్టర్ పవన్ కళ్యాణ్.. తెలంగాణ బరాబర్ మా అయ్య జాగీరే అని పొన్నం ప్రభాకర్ తేల్చి చెప్పారు. ఈ తెలంగాణ ప్రాంతం మా తండ్రి, తాతల జాగీరు అని.. మీ అయ్య జాగీరు కాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన పొన్నం ప్రభాకర్.. పవన్ కళ్యాణ్ మళ్లీ తన అహంకారాన్ని ఈ మీడియా సమావేశం ద్వారా ప్రదర్శించారని మండిపడ్డారు.

హైదరాబాద్, జూన్ 2 (ఈవార్తలు): తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా సభకు అనుమతి లేకపోవడంతో.. హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. తనను విమర్శించిన వారిపై, తన సభను అడ్డుకున్న వారిపై తీవ్ర విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తనను తెలంగాణలో అడుగు పెట్టనివ్వమని, తిరగనివ్వమని మాట్లాడుతున్నారని.. తెలంగాణ ఏమైనా వారి అయ్య జాగీరా అంటూ ప్రశ్నించారు. అయితే ఈ వ్యాఖ్యలపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తనకు ఆంధ్రప్రదేశ్‌లోనే దిక్కులేదని స్వయంగా పవన్ కళ్యాణ్ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



కలుషిత తాగునీటి సమస్యపై కాలిఫోర్నియాలోని హింక్లీలో పోరాటం చేసి గుర్తింపు పొందిన పర్యావరణ ఉద్యమకారిణి ఎరిన్ బ్రోకోవిచ్ ఇప్పుడు తన దృష్టిని బిగ్ టెక్ కంపెనీల డేటా సెంటర్లపై కేంద్రీకరించారు. అమెరికా వ్యాప్తంగా ఇప్పటికే పనిచేస్తున్న, నిర్మాణంలో ఉన్న, అలాగే ప్రతిపాదిత ఏఐ (కృత్రిమ మేధస్సు) ఆధారిత డేటా సెంటర్ల వివరాలతో కూడిన క్రౌడ్‌సోర్స్ మ్యాప్‌ను అందుబాటులో ఉంచారు. తమ ప్రాంతాల్లో ఏర్పడుతున్న డేటా సెంటర్ ప్రాజెక్టులపై స్థానిక ప్రజలు నేరుగా సమాచారాన్ని అందించే అవకాశాన్ని కూడా ఈ ప్లాట్‌ఫారమ్ కల్పిస్తోంది. ముఖ్యంగా నీటి వినియోగం, విద్యుత్ అవసరాలు, శబ్ద కాలుష్యం, ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ–వేస్ట్) సమస్యలపై ప్రజల ఆందోళనలను ఇది వెలుగులోకి తీసుకువస్తోంది.



## అమెరికాలో 30 మంది భారతీయ ట్రక్కు డ్రైవర్ల అరెస్ట్

న్యూయార్క్: అగ్రరాజ్యం అమెరికాలో అక్రమ వలసదారులపై ట్రంప్ యంత్రాంగం నిఘాను తీవ్రం చేసింది. నిబంధనలను ఉల్లంఘించి చట్టవిరుద్ధంగా దేశంలో నివాసం ఉంటున్న వారిని ఏరివేసే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే అమెరికాలో కమర్షియల్ ట్రక్కులు నడుపుతూ జీవనం సాగిస్తున్న 30 మంది భారతీయులను యూఎస్ సరిహద్దు రక్షణ విభాగాలు అరెస్ట్ చేశాయి. చట్టవిరుద్ధంగా దేశంలో ఉంటున్నందుకు గానూ వీరిని త్వరలోనే అమెరికా నుంచి స్వదేశానికి బహిష్కరించేందుకు అధికారులు ఏర్పాట్లు

## కుమార్తెలకు పెళ్లయినా కారుణ్య నియామకాలకు అర్హులే

### తల్లి మరణంతో చౌక ధరలు దుకాణం లైసెన్స్ కోసం దరఖాస్తు

### కారుణ్య నియామకం వర్తించదని తిరస్కరించిన యూపీ సర్కారు

### అలహాబాద్ హైకోర్టు సమర్థించడంతో సుప్రీం కోర్టుకు మహిళ



కారుణ్య నియామకాలకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ నియామకాల్లో వివాహితులైన కుమార్తెలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. కారుణ్య నియామకాల్లో పెళ్లైన కుమార్తె అర్హురాలు కాదంటూ గతంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ మేరకు సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. వివాహమైందన్న కారణాన్ని సాకుగా చూపి అర్హురాలైన కుమార్తెకు కారుణ్య నియామకాన్ని నిరాకరించడం సరికాదని గతంలో బాంబే, కర్ణాటక హైకోర్టులు ఇచ్చిన తీర్పులతో ఏకీభవిస్తున్నట్లు జస్టిస్ పీఎల్ నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధేల ధర్మాసనం తేల్చిచెప్పింది.

న్యూఢిల్లీ: వివాహితులైన కుమారులకు కారుణ్య నియామకం కోసం ఎలాంటి ఇబ్బంది లేనప్పుడు, వివాహితులైన కుమార్తెలు ఎందుకు అర్హులు కాదని వ్యాఖ్యానించింది. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన మహిళ కారుణ్య నియామకం ఆధారంగా తనకు చౌక ధరల దుకాణం డీలర్‌షిప్ లైసెన్స్‌ను ప్రభుత్వం నిరాకరించడంతో అలహాబాద్ హైకోర్టును ఆమె ఆశ్రయించారు. కుటుంబ



## నీళ్లు ఊరుతలేవు!

### హైదరాబాద్‌లో అడుగంటిన భూగర్భ జలాలు

### రాజస్థాన్ ఎడారి జిల్లాల కంటే దారుణం

### ఆందోళన వ్యక్తం చేస్తున్న జల నిపుణులు

ప్రపంచ స్థాయి ఐటీ హబ్‌గా, రియల్ ఎస్టేట్ కేంద్రంగా దూసుకుపోతున్న హైదరాబాద్ నగరం మరోవైపు తీవ్రమైన జల సంక్షోభం వైపు వేగంగా అడుగులు వేస్తోంది. కేంద్ర జలశక్తి శాఖ విడుదల చేసిన డైనమిక్ గ్రౌండ్ వాటర్ రిసోర్స్ అసెస్‌మెంట్ రిపోర్ట్–2025 నగర భవిష్యత్తుపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేసింది. నివేదిక ప్రకారం హైదరాబాద్ జిల్లాలోని మొత్తం 16 మండలాల్లో

## రాశి ఫలాలు

3.6.2026

మేషం: దూర ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా పడతాయి. బంధువులతో అకారణంగా విభేదాలు కలుగుతాయి. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపార, ఉద్యోగాలలో పని ఒత్తిడి తప్పదు.

వృషభం: ఆదాయం మరింత పెరుగుతుంది. రాజకీయ వర్గాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు లాభాల బాట పడతాయి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మిధునం: విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. నూతన వాహన యోగం ఉన్నది. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. అధికారులతో చర్చలు ఫలిస్తాయి. వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో అవరోధాలు అధిగమిస్తారు.

కర్కాటకం: ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధు మిత్రులతో విభేదాలు కలుగుతాయి. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. పనుల్లో కొద్దిపాటి ఆటంకాలు కలుగుతాయి. వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడులు పెరుగుతాయి.

సింహం: బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. రాబడికి మించి ఖర్చులు ఉంటాయి. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు విశ్రాంతి లేకుండా చేస్తాయి.

కన్య: విద్యార్థులకు పరీక్ష ఫలితాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. మొండి బాకీలు వసూలవుతాయి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. సన్నిహితుల నుండి కొత్త విషయాలు తెలుసుకుంటారు. వ్యాపారాలలో అధిక లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో సమస్యలు తీరి ఊరట చెందుతారు.

తుల: కుటుంబ సమస్యలు మరింత చికాకు పరుస్తాయి. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. మిత్రులతో విభేదాలు కలుగుతాయి. నూతన ఋణాలు చేస్తారు. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది.

వృశ్చికం: అందరిలోనూ మీ విలువ పెరుగుతుంది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. దూరపు బంధువుల నుండి శుభవర్తమానాలు అందుతాయి. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

ధనస్సు: కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రయాణాలు వాయిదా వేస్తారు. బంధువులతో మాట పట్టింపులు ఉంటాయి. ముఖ్యమైన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపారాలలో ఊహించని సమస్యలు ఉంటాయి.

మకరం: ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలలో లాభాలు అందుతాయి. పనులు సజావుగా సాగుతాయి. ఆప్తుల నుండి విలువైన విషయాలు సేకరిస్తారు. ఉద్యోగుల కలలు సహకారం అవుతాయి.

కుంభం: ప్రముఖులతో పరిచయాలు లాభిస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. బంధువులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. చేపట్టిన పనులలో ప్రయత్నకార్యసిద్ధి కలుగుతుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి.

మీనం: మిత్రులతో అకారణంగా విభేదాలు కలుగుతాయి. వ్యాపారాలలో కష్టానికి ఫలితం కనిపించదు. సోదరులతో ఆస్తి వివాదాలు కలుగుతాయి. పని ఒత్తిడి అధికమవుతుంది. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగాలలో సమస్యలు మరింత చికాకు కలిగిస్తాయి.

# సజీవం తెలంగాణస్వరం

మొదటి పేజీ తరువాయి

గొప్పగా కీర్తించడం తెలంగాణ సమాజంలో చర్చనీయాంశంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీల నేతలు కూడా తెలంగాణ ప్రజల మనోభావాలను సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### బీజేపీ లెక్క తప్పుతోందా?

తెలంగాణలో బీజేపీ ఎదగడానికి ప్రధాన కారణాల్లో ఒకటి తెలంగాణ ఆత్మగౌరవాన్ని గౌరవిస్తుందనే అభిప్రాయం. అయితే ఇటీవల కాలంలో ఆ పార్టీకి చెందిన కొందరు ప్రముఖ నేతలు ఆంధ్రప్రదేశ్ కూటమి నాయకత్వంపై చూపుతున్న మక్కువ తెలంగాణ వాదుల్లో సందేహాలను రేకెత్తిస్తోంది. రఘునందన్ రావు, బండి సంజయ్ వంటి నాయకులు ఏపీ కూటమి నేతలను పదేపదే ప్రశంసించడం, వారి రాజకీయ ఎజెండాలకు బహిరంగ మద్దతు తెలపడం తెలంగాణ ప్రజల్లో ప్రతికూల సంకేతాలను పంపుతోంది. జాతీయ రాజకీయాలు వేరు, ప్రాంతీయ ఆత్మగౌరవం వేరు అనే సత్యాన్ని బీజేపీ గుర్తించకపోతే రాజకీయంగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

### బీఆర్ఎస్ ఓడింది.. తెలంగాణ వాదం కాదు

2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందింది. కానీ దాన్ని తెలంగాణ భావోద్వేగం ఓడిపోయిందని అర్థం చేసుకోవడం ప్రమాదకర రాజకీయ విశ్లేషణగా చెప్పాలి. తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమం ఏ ఒక్క పార్టీ సొత్తు కాదు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మేధావులు, కళాకారులు, సాధారణ ప్రజలు కలిసి నిర్మించిన చారిత్రక ఉద్యమం అది. ఆ ఉద్యమం వెనుక ఉన్న ఆత్మగౌరవ భావన ఇప్పటికీ ప్రజల్లో బలంగానే ఉంది. బీఆర్ఎస్‌పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారే తప్ప, తెలంగాణ ఆత్మగౌరవాన్ని తిరస్కరించలేదు. అందుకే ఇప్పటికీ తెలంగాణ అనే అంశం చర్చకు వస్తే ప్రజలు భావోద్వేగంగా స్పందిస్తున్నారు.

### రేవంత్ గ్రహించాల్సిన వాస్తవం ఇదే

ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా ఇదే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తూ తెలంగాణ ఉద్యమ వారసత్వాన్ని తక్కువ చేసి మాట్లాడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించినంత మాత్రాన ఉద్యమాన్ని తిరస్కరించలేదు. ఉద్యమం ద్వారా సాధించిన రాష్ట్రాన్ని మెరుగ్గా పాలించాలని మాత్రమే కోరుకున్నారు. ఈ సున్నితమైన వ్యత్యాసాన్ని అర్థం చేసుకోకపోతే కాంగ్రెస్ కూడా భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్రా పెత్తనాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన నాయకుల్లో పలువురు ఇప్పుడు పూర్తిగా భిన్నంగా కనిపిస్తున్నారు. ఒకప్పుడు తెలంగాణ హక్కుల కోసం పోరాడిన కొందరు నేతలు కూడా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకత్వంతో అత్యంత సాన్నిహిత్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ సంబంధాలు అవసరమే కావచ్చు. పరస్పర సహకారం కూడా అవసరమే కావచ్చు. కానీ తెలంగాణ స్వాభిమానాన్ని పక్కన పెట్టి వ్యవహరిస్తున్నారనే భావన కలిగితే ప్రజలు దాన్ని సహించరు. ఉద్యమంలో పాల్గొన్న తరాలు ఇప్పటికీ జీవించి ఉన్నాయనే విషయాన్ని నాయకులు గుర్తుంచుకోవాలి.

### తెలంగాణ సమాజం కోరేది స్వాభిమానం

తెలంగాణ ప్రజలు ఆంధ్రప్రదేశ్ ప్రజలను వ్యతిరేకించడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలని కోరుకుంటున్నారు. కానీ స్నేహం పేరుతో తెలంగాణ ప్రత్యేకతను, తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడాన్ని మాత్రం అంగీకరించడం లేదు. తెలంగాణ ఉద్యమం వెనుక ఉన్న బాధ, వివక్ష అనుభవాలు, దశాబ్దాల పోరాటం ఇప్పటికీ ప్రజల జ్ఞాపకాలలో ఉన్నాయి. అందుకే తెలంగాణ భావోద్వేగాన్ని చిన్నచూపు చూడటం లేదా అది పూర్తిగా ముగిసిపోయిందని భావించడం రాజకీయ అజ్ఞానంగా మారుతోంది. తెలంగాణ రాజకీయాల్లో ఒక వాస్తవాన్ని అన్ని పార్టీలు గుర్తుంచుకోవాలి. బీఆర్ఎస్ బలహీనపడవచ్చు, నాయకులు మారవచ్చు, ప్రభుత్వాలు మారవచ్చు. కానీ తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ అస్తిత్వ భావన, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి మాత్రం అంత తేలికగా అంతరించిపోదు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటారు. సంక్షేమాన్ని ఆశిస్తారు. కానీ వాటితో పాటు తమ అస్తిత్వాన్ని గౌరవించే నాయకత్వాన్ని కూడా కోరుకుంటారు. తెలంగాణ ప్రజల మనసుల్లో ఇంకా సజీవంగా ఉన్న ఈ భావోద్వేగాన్ని అర్థం చేసుకున్న వారికే భవిష్యత్తులో రాజకీయంగా ఆదరణ లభిస్తుంది. దాన్ని విస్మరించిన వారు ఎంత పెద్ద పార్టీకి చెందిన వారైనా ప్రజల తీర్పు నుంచి తప్పించుకోలేరని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# ప్రజల మనోభావాలకు ప్రతినిధులం

మొదటి పేజీ తరువాయి

కోసం దశాబ్దాల ఉద్యమంలో ఎందరో అమరులయ్యారు. మరెందరో పోరాట యోధులుగా నిలిచారు. వారి త్యాగాలకు, తెగువకు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. “కోటి రతనాల వీణ.. నా తెలంగాణ” రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. ప్రతి ఏటా త్యాగాల చరిత్రను స్మరిస్తూ, రేపటి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసుకునే ఒక భావోద్వేగ సందర్భం జూన్ 2 అని అన్నారు. మనం కలలు కన్న స్వరాష్ట్ర స్వప్నాన్ని నిజం చేసిన ఆనాటి ప్రధానమంత్రి స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్, నాటి యూపీఏ చైర్‌పర్సన్ శ్రీమతి సోనియా గాంధీలకు తెలంగాణ సమాజం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నా’నని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. “పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది” అన్న ప్రజాకవి కాళోజీ మాటలే స్ఫూర్తిగా 2023 డిసెంబర్ 7న బాధ్యతలు స్వీకరించిన క్షణం నుంచి ప్రతిక్షణం తెలంగాణ హితమే పరమార్థంగా, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా, పేదరిక నిర్మూలనే ప్రాధాన్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్రంలో అధికారం ఇవ్వడంతో పాటు, ఈ రెండున్నరేళ్లలో జరిగిన పలు ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో మా పట్ల మీరు చూపించిన ఆదరణ, అభిమానం మరువలేనివని అన్నారు. ఎవరెన్ని విమర్శలు, కుట్రలు చేసినా ప్రజలు మాకు అండగా నిలవడం ఎనలేని శక్తిని ఇచ్చిందని, ప్రజల సంక్షేమం పట్ల, రాష్ట్ర అభివృద్ధి పట్ల మా బాధ్యతను మరింత పెంచిందన్నారు. ‘నాటి రాచరికం నుంచి నిన్నటి నియంతృత్వం వరకు తెలంగాణ తిరుగుబాటు చరిత్ర మొత్తం చెబుతున్న సత్యం ఇదే. ఆ చరిత్రకు మనం సాక్షులం. రాచరిక ఆలోచనలు, నియంతృత్వ పోకడలను ఓడించి కొత్త చరిత్రను రాసుకోవడం కోసం మీరు ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారు. ఈ రోజు ప్రజల మనోభావాలకు మేం ప్రతినిధులం. సమాజ ఆకాంక్షలకు మేం వారధులం. అందుకే మీరిచ్చిన ఈ అవకాశాన్ని మేం అధికారంగా సంబోధించడం లేదు. మమ్మల్ని మేం పాలకులుగా అనుకోవడం లేదు. మీకు సేవకులుగా బాధ్యత నిర్వర్తిస్తున్నాం. ప్రభుత్వం అంటే నలుగురి చేతుల్లో పెత్తనం కాదు. నాలుగు కోట్ల ప్రజల ఉమ్మడి ప్రతినిధి అని మేం భావిస్తున్నాం. బాధ్యతగా పని చేస్తున్నాం. అందుకే ఇది కేవలం పరిపాలన చేసే ప్రభుత్వం కాదు.. ప్రజాస్వామ్య ఆకాంక్షలను నెరవేర్చే ప్రజా ప్రభుత్వం అని గర్వంగా చెబుతున్నా’మని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

### తెలంగాణ రైజింగ్ -- 2047

దేశంలోనే కాదు, ప్రపంచానికే తెలంగాణను గేట్‌వేగా నిలబెట్టాలన్నది నా స్వప్నం. దానికి మార్గం “తెలంగాణ రైజింగ్ -- 2047” డాక్యుమెంట్ అని సీఎం అన్నారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి త్రి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది ప్రజా ప్రభుత్వ సంకల్పమన్నారు. దానికి ప్రజల అండదండలు కావాలని, మీ అందరి సహకారం, ఆశీర్వాదంతో ఈ లక్ష్యాన్ని చేరుకుంటామన్న విశ్వాసం తనకు ఉందన్నారు. ఈ ఆర్థిక వృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తెలంగాణ అభివృద్ధికి పునరంకితం కావాలని కోరుకుంటూ రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ సీఎం తన ప్రసంగాన్ని ముగించారు.

# నీళ్లు ఊరుతలేవు!

మొదటి పేజీ తరువాయి

15 మండలాలు భూగర్భ జలాల లభ్యత విషయంలో అత్యంత ప్రమాదకరమైన ‘క్రిటికల్’, ‘ఓవర్ ఎక్స్‌ప్లాయిటెడ్’ కేటగిరీల్లోకి చేరాయి. భూగర్భ జలాల క్షీణత పరంగా హైదరాబాద్ పరిస్థితి ఇప్పుడు రాజస్థాన్‌లోని ఎడారి జిల్లాలకు ఏమాత్రం తీసిపోని స్థాయికి చేరుకుంది. రాజస్థాన్‌లో అత్యంత కరువు ప్రభావిత జిల్లాగా పేరున్న బార్మర్‌లో 14 మండలాలు ప్రమాదకర జాబితాలో ఉండగా, హైదరాబాద్‌లో 15 మండలాలు ఆ స్థితికి చేరుకోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. నగరంలోని సగం మండలాలు ఓవర్ ఎక్స్‌ప్లాయిటెడ్ కేటగిరీలో ఉండగా, మరో 43 శాతం మండలాలు క్రిటికల్ స్థితిలో ఉన్నాయి. పంజాబ్‌లో భూగర్భ జలాలు తీవ్రంగా క్షీణించిన జలంధర్, లూథియానా వంటి డార్క్ జోన్ జిల్లాలతో హైదరాబాద్‌ను ఇప్పుడు పోల్చాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### ప్రమాదంలో కీలక ప్రాంతాలు

సికింద్రాబాద్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, హిమాయత్‌నగర్, ముషీరాబాద్, నాంపల్లి, షేక్‌పేట్, సైదాబాద్ వంటి నగరంలోని ప్రధాన మండలాలు భూగర్భ జలాల సంక్షోభం తీవ్రంగా ఉన్న ప్రాంతాలుగా గుర్తించబడ్డాయి. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లోని 10 మండలాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని మరో 5 మండలాలు కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయి. అడ్డూఅదుపు లేకుండా భూగర్భ జలాలను వినియోగించడం, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే వ్యవస్థలను నిర్లక్ష్యం చేయడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. జేఎన్‌టీయూహెచ్ వాటర్ రిసోర్సెస్ సెంటర్ మాజీ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుతం నగరంలో 1200 నుంచి 1500 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీరు రావడం లేదని, భూమి అడుగున గట్టి రాతి పొరలు మాత్రమే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### వర్షాలు పడుతున్నా.. నీరు నిలవడం లేదు

హైదరాబాద్‌లో ప్రతి సంవత్సరం సగటున 900 నుంచి 1000 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం నమోదవుతున్నప్పటికీ, ఆ నీటిలో ఎక్కువ భాగం డ్రైనేజీల ద్వారా వృథాగా వెళ్లిపోతోందని నిపుణులు పేర్కొంటున్నారు. వర్షపు నీటిని భూమిలోకి పంపించే సమర్థమైన వ్యవస్థలు లేకపోవడం వల్ల భూగర్భ జలాలు పునరుత్పత్తి కావడం లేదని వారు హెచ్చరిస్తున్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిపుణుడు కె.ఎం. లక్ష్మణరావు మాట్లాడుతూ, భవిష్యత్తులో హైదరాబాద్ తీవ్రమైన జల సంక్షోభంలో చిక్కుకోకుండా ఉండాలంటే ప్రభుత్వం ఒక్కటే కాకుండా ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో తప్పనిసరిగా రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించారు. బోరుబావులకు అనుసంధానంగా ఇంకుడు గుంతలు నిర్మించడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి పంపించే చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ఎకరం భూమి విలువ రూ.200 కోట్లకు పైగా పలుకుతున్న తరుణంలో, భూమి పైన ఉన్న ఆర్థిక సంపదతో పాటు భూమి కింద ఉన్న జల సంపదను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. విచ్చలవిడి కాంక్రీట్ నిర్మాణాలను నియంత్రించడం, బోరుబావుల తవ్వకాలకు పరిమితులు విధించడం, వర్షపు నీటి సంరక్షణను తప్పనిసరి చేయడం వంటి చర్యలు వెంటనే చేపట్టకపోతే భవిష్యత్తులో హైదరాబాద్ తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న హైదరాబాద్, భూగర్భ జలాల విషయంలో మాత్రం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజలు, పరిశ్రమలు కలిసి నీటి సంరక్షణపై దృష్టి సారించకపోతే భవిష్యత్తులో నగరం ఎదుర్కోబోయే అతిపెద్ద సంక్షోభం నీటిదేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. హైదరాబాద్ అభివృద్ధి కొనసాగాలంటే జల వనరుల పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది.

# తెలంగాణ మీ అయ్య జాగీరా?

మొదటి పేజీ తరువాయి

ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్, తెలంగాణలోకి తనను అడుగు పెట్టనివ్వబోమని అంటున్నారని, తెలంగాణ మీ అయ్య జాగీరా? అంటూ పవన్ నిప్పులు చెరిగారు. తాను తెలంగాణ నలు మూలలా తిరిగానని, తెలంగాణ బాగుండాలని అనుకునే వాడినని పవన్ అన్నారు. 2007లోనే తనను ఈ రోజు విమర్శిస్తున్న గొంతులు లేవని అన్నారు. ఆదిలాబాద్ లాంటి నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో తిరిగానని చెప్పారు. తెలంగాణపై ఈ రోజు కొత్తగా ప్రేమ రాలేదని స్పష్టం చేశారు. తాను తెలంగాణకు వ్యతిరేకం కాదని, విభజన జరిగిన తీరుకు వ్యతిరేకం అని పవన్ చెప్పారు. పార్లమెంట్ తలుపులు మూసి ఉమ్మడి ఏపీని విభజించిన తీరుకు జనసేన వ్యతిరేకం అని, ఈ విషయంపై తెలంగాణ ప్రజలకు మరోసారి స్పష్టతనిస్తున్నానని పవన్ అన్నారు. సామాజిక తెలంగాణ నినాదంతో అన్ని కులాలు బాగుండాలి అన్నదే జనసేన విధానం అని అన్నారు. తెలంగాణ సంస్కృతిపై, తెలంగాణపై తనకు ఎంత ప్రేమ ఉందో తనను విమర్శించే నాయకులకు చెప్పాల్సిన అవసరం లేదని చెప్పారు. కష్టంలో ఉన్నప్పుడు తన వెంట ఉన్నది తెలంగాణ ప్రజలని, వారాహికి అనుమతినిచ్చింది తెలంగాణ ప్రభుత్వం అని అన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రంపై తనకు ఎంతో ప్రేమ ఉందన్న పవన్ కళ్యాణ్.. అది రాజకీయాలకు అతీతమన్నారు. వారాహి యాత్ర మొదలుకుని అనేక సమయాల్లో తెలంగాణ ప్రజలు తనకు అండగా నిలిచారని గుర్తు చేశారు. తనకు అధికారం కావాలని లేదని.. ముఖ్యమంత్రి కావాలనే ఆశే లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే దిక్కులేదు.. తెలంగాణలో ముఖ్యమంత్రి అవుతానా అంటూ పవన్ కళ్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో జనసేన పార్టీని బలోపేతం చేయమని తమ నేతలు చాలా సార్లు అడిగారన్న పవన్ కళ్యాణ్.. ఏపీలోనే అధికారం కోరుకోని వాణ్ని.. తెలంగాణలో అధికారం కోరుకుంటామా అని ప్రశ్నించారు. ఇక కోడిచెరువు కబ్జా చేశారనే ఆరోపణలపైనా పవన్ కళ్యాణ్ స్పందించారు. తాను కబ్జా చేశానని నిరూపిస్తే.. తన ఆస్తిని స్వాధీనం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని.. పోటీ చేస్తుందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణ వచ్చినందుకు 11 రోజులు అన్నం తినలేదనే విమర్శలపైనా పవన్ కళ్యాణ్ క్లారిటీ ఇచ్చారు. తాను బాధపడింది విభజన జరిగినందుకు కాదని.. విభజించిన తీరే బాధ కలిగించిందని పవన్ కళ్యాణ్ అన్నారు. తెలంగాణలో జనసేన పార్టీని విమర్శిస్తున్న వారు.. ప్రత్యేక తెలంగాణను వ్యతిరేకించిన సీపీఎం, ఎంఐఎం పార్టీలను ఎందుకు నిలదీయరని ప్రశ్నించారు. కేవలం జనసేన పార్టీనే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో జనసేనతో బీజేపీ పార్టీ కలిసి వస్తుందో, రాదో తనకు తెలియదని.. జనసేన పార్టీ మాత్రం కచ్చితంగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. చావుకు సిద్ధపడే తాను పార్టీ పెట్టినట్లు తెలిపారు.

# బరాబర్ మా అయ్య జాగీరే

మొదటి పేజీ తరువాయి

అంగీకరించారని గుర్తు చేసిన పొన్నం ప్రభాకర్.. తెలంగాణలో ఏం పని అని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు విడిపోయినప్పటికీ.. ప్రాంతాలుగా తెలుగు రాష్ట్రాల ప్రజలు కలిసి ఉండాలని తాము కోరుకున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభతో తెలంగాణలో పవన్ కళ్యాణ్ పీకేది ఏముందని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్ బీఆర్ఎస్ లేదా బీజేపీ ఎవరో ఒకరు ఎంగేజ్ చేసుకున్న ఆర్టిస్ట్ అని.. అయితే ఆయనకు సరైన స్క్రిప్ట్ ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. సినిమాల్లో ఆర్టిస్ట్‌ను స్క్రీన్ టెస్ట్ చేసినట్లు తెలంగాణ రాజకీయాల్లో పవన్ కళ్యాణ్‌ను బీజేపీ పార్టీ టెస్ట్ చేస్తున్నారనేది వాస్తవం అని తెలిపారు. ఇక తెలంగాణకు పవన్ కళ్యాణ్ రావడానికి, పోవడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని తేల్చి చెప్పిన పొన్నం ప్రభాకర్.. కానీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజే కావాలని గెలికి మరీ నవ నిర్మాణ సంకల్ప సభ పేరుతో సభ నిర్వహిస్తాం అంటే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఆంధ్ర ప్రజలకు ఎప్పుడూ తెలంగాణ ప్రజలు స్వాగితిస్తున్నారని గుర్తు చేశారు. మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామని తెలిపారు. ఎప్పుడైనా తెలంగాణకు పవన్ కళ్యాణ్ మద్దతు ఇచ్చారా.. తెలంగాణ అమరవీరులకు ఏరోజైనా అండగా నిలిచారా అని మంత్రి పొన్నం ప్రశ్నించారు.

# కుమార్తెలకు పెళ్లయినా కారుణ్య నియామకాలకు అర్హులే

మొదటి పేజీ తరువాయి

నిర్వచనం నుంచి వివాహమైందనే కారణంతో తనను పక్కనపెడుతూ 2019లో యూపీ ప్రభుత్వం ఇచ్చి ఆదేశాలను ఆమె సవాల్ చేశారు. తనకు వివాహమైనప్పటికీ దివ్యాంగురాలైన తన సోదరిని, తల్లిని చూసుకుంటూ దుకాణాన్ని నిర్వహించినట్లు వివరించారు. తన తల్లి మరణం తర్వాత లైసెన్స్ కోసం సదరు మహిళ చేసిన దరఖాస్తును అధికారులు తిరస్కరించారు. అయితే, యూపీ ప్రభుత్వ నిర్ణయాన్ని అలహాబాద్ హైకోర్టు సమర్థించడంతో ఆమె సుప్రీం కోర్టుకు వెళ్లారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం అలహాబాద్ హైకోర్టు తీర్పును తప్పుబట్టింది. ఆమెకు లైసెన్స్ నిరాకరిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను తోసిపుచ్చింది. నాలుగు వారాల్లోగా ఆమెకు లైసెన్స్ జారీ చేయాలని సంబంధిత అధికారులను కోర్టు ఆదేశించింది. “సైదా బేగం కేసు సరైన చట్టాన్ని పొందుపరచలేదు.. ప్రస్తుత కేసులో ఆధారాలను బట్టి.. అప్పీలుదారు (బాధితురాలు) వివాహం తర్వాత కూడా అదే గ్రామంలో నివసిస్తూ, చౌక ధరల దుకాణం నిర్వహణలో తన తల్లికి సహాయం చేసిందని స్పష్టమవుతోంది. తల్లి మరణానంతరం, ఆమె తన సోదరితో పాటు శారీరక వైకల్యం ఉన్న మరో సోదరి బాధ్యతను కూడా స్వీకరించారు... కేవలం ఆమె ‘వివాహిత కుమార్తె’ అనే కారణంతో ఆమె దరఖాస్తును తిరస్కరించడం రాజ్యాంగబద్ధంగా చెల్లని అంశం” అని ధర్మాసనం స్పష్టం చేసింది.

# 30 మంది భారతీయ ట్రక్కు డ్రైవర్ల అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారు. ఈ భారీ అరెస్టులకు సంబంధించిన వివరాలను ‘యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్’ (సీబీపీ) ఒక అధికారిక ప్రకటన ద్వారా బహిర్గతం చేసింది. అమెరికా రహదారులపై వాణిజ్య అవసరాల కోసం తిరిగే పెద్ద పెద్ద సెమీ ట్రక్కులను నడుపుతూ.. దేశంలో అక్రమంగా నివాసం ఉంటున్న వారిని టార్గెట్ చేస్తూ యూఎస్ బోర్డర్ పెట్రోల్ విభాగం ఒక ప్రత్యేక నిఘా చర్యను చేపట్టింది. అందులో భాగంగానే గత నెలలో ఆరిజోనా రాష్ట్రంలోని యూమా సెక్టార్‌కు చెందిన సరిహద్దు రక్షణ ఏజెంట్లు ‘ఆపరేషన్ చెక్‌మేట్’ పేరుతో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా అమెరికా వ్యాప్తంగా చట్టవిరుద్ధంగా సంచరిస్తున్న మొత్తం 52 మందిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని లోతుగా విచారించగా.. అందులో 36 మంది సెమీ ట్రక్కులను నడిపే ప్రొఫెషనల్ డ్రైవర్లుగా తేలింది. ఈ 36 మంది డ్రైవర్లలో అత్యధికంగా 30 మంది భారత దేశానికి చెందినవారే కావడం గమనార్హం. కాగా మిగిలిన ఆరుగురు డ్రైవర్లు మెక్సికో, ఎల్ సాల్వడార్, రష్యా దేశాలకు చెందిన వలసదారులుగా అధికారులు గుర్తించారు. ప్రస్తుతం వీరందరిపై అమెరికా ఫెడరల్ చట్టాల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకున్నారు. చట్టపరమైన ప్రక్రియ ముగిసిన వెంటనే ఈ 30 మంది భారతీయ డ్రైవర్లను దేశం నుంచి వెలివేయనున్నారు.

## తెలంగాణలో 'పెద్ది' టికెట్ ధరల పెంపు

హైదరాబాద్, జూన్ 2 (ఈవార్తలు) : తెలంగాణలో 'పెద్ది' చిత్రానికి టికెట్ ధరలను పెంచుకునేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అంతేకాదు, జూన్ 3న రాత్రి 8 గంటలకు స్పెషల్ ప్రీమియర్ షో వేసేందుకు అనుమతి లభించింది. ఈ స్పెషల్ షోకు టికెట్ ధర రూ.600 (జీఎస్‌టీతో కలిపి), అలాగే సినిమా విడుదల తేదీ నుంచి 10 రోజుల పాటు టికెట్ ధరలను పెంచుకునే వెసులుబాటు కల్పించింది. ప్రస్తుతమున్న టికెట్ ధరలపై సింగిల్ స్క్రీన్‌లలో రూ.100 చొప్పున, మల్టీప్లెక్స్‌ల్లో రూ.125 చొప్పున పెంచుకునేందుకు అవకాశమిచ్చింది. వీటితో పాటు రోజుకు 5 షోలు ప్రదర్శించుకునేందుకు వీలు కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

## అమల్లోకి న్యాయవాదుల రక్షణ చట్టం

హైదరాబాద్, జూన్ 2 (ఈవార్తలు): తెలంగాణలో న్యాయవాదుల భద్రతకు భరోసా కల్పిస్తూ రూపొందించిన 'అడ్వకేట్ల పరిరక్షణ చట్టం-2026' మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేస్తూ అధికారికంగా నోటిఫై చేసింది. ఈ మేరకు రాష్ట్ర న్యాయశాఖ జీఓ నెం.41ను జారీ చేసింది. వృత్తిపరమైన విధుల్లో ఉన్న న్యాయవాదులపై దాడులు, వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో వారి రక్షణ కోసం ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో అసెంబ్లీలో 'తెలంగాణ అడ్వకేట్ల పరిరక్షణ బిల్లు-2026'ను ఆమోదించింది. గవర్నర్ ఆమోదం పొందిన ఈ చట్టం ఇప్పుడు అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం న్యాయవాదులకు పోలీస్ రక్షణ, తప్పుడు కేసుల నుంచి భద్రత, వేధింపులపై ఫిర్యాదుల కోసం ప్రత్యేక యంత్రాంగం, బెదిరింపుల నుంచి రక్షణ వంటివి కల్పిస్తారు. ఇటీవల హైకోర్టు న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్ హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురైన కొద్దిరోజులకే ఈ చట్టం అమలులోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మే 23న మసాబ్ ట్యాంక్‌లోని తన ఇంటి వద్ద మొయిజుద్దీన్‌ను ఒక కారుతో ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టడంతో ఆయన మరణించారు. ఈ కేసులో కాంగ్రెస్ నేత ముజాహిద్ ఆలం ఖాన్, అతని తండ్రి సహా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వక్ఫ్ ఆస్తుల వివాదమే ఈ హత్యకు కారణమని, రూ.15 లక్షల సుపారీ ఇచ్చి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఈ చట్టం న్యాయవాదుల ఆత్మవిశ్వాసాన్ని పెంచి, వారు నిర్భయంగా విధులు నిర్వర్తించడానికి దోహదపడుతుందని శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు గతంలో తెలిపారు. కర్ణాటక, రాజస్థాన్ తర్వాత దేశంలో ఇలాంటి చట్టాన్ని తీసుకొచ్చిన మూడో రాష్ట్రం తెలంగాణ కావడం విశేషం.

## సర్‌తో జర జాగ్రత్త: భట్టి

హైదరాబాద్, జూన్ 2 (ఈవార్తలు): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై మీడియా ప్రత్యేక దృష్టి పెట్టాలని, అర్హులైన వారి ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ 'ఎస్ఐఆర్ మ్యాపింగ్' అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఆయన కోరారు. సచివాలయంలో జరిగిన తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలపై ఆయన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అసలు ప్రత్యర్థులే లేరని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ తీరును తప్పుబడుతూ.. "భారతీయ జనతా పార్టీ పక్కా రైతు వ్యతిరేక పార్టీ" అని ఆయన దుయ్యబట్టారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే ప్రభుత్వాలకు, పార్టీలకు ప్రత్యేకంగా ప్రచారం అవసరం లేదని.. తాము చేసిన పనులే మాట్లాడతాయని చెప్పారు. ఇప్పటికే జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన సత్తా ఏంటో నిరూపించుకుందని ఆయన గుర్తుచేశారు. ఇదే క్రమంలో అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం త్వరలోనే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటుందని భట్టి విక్రమార్క వెల్లడించారు.

## తెలంగాణ అస్తిత్వాన్ని తుడిచేయాలని చూస్తే ఊరుకోం

మరో పోరాటానికి సిద్ధం కావాలి: వేముల ప్రశాంత్ రెడ్డి

బాల్కొండ, జూన్ 2 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర సమాజం ఎంతో పోరాడి, ఎందరో అమరవీరుల త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రాన్ని, ఇక్కడి అస్తిత్వాన్ని కనుమరుగు చేయడానికి కొన్ని శక్తులు మళ్లీ కుట్రలు పన్నుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బాల్కొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 2001లో కేసీఆర్ ఒంటిచేత్తో మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించి, అంబేద్కర్ సిద్ధాంతాల స్ఫూర్తితో 14 ఏళ్ల పాటు అలుపెరుగని ప్రజాస్వామ్య పోరాటం చేసి తెలంగాణను సాధించారని గుర్తుచేశారు. నాడు కేసీఆర్ సృష్టించిన రాజకీయ అనివార్యత వల్లే కాంగ్రెస్, టీడీపీలు లొంగివచ్చాయని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపారని కొనియాడారు. అయితే ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుబంధును 'ఓట్లు ఉంటేనే' అన్న చందంగా మార్చిందని, రైతుబీమాను పక్కన పడేసిందని విమర్శించారు. మరోవైపు, పొరుగు రాష్ట్ర నేతల తీరుపై వేముల తీవ్రంగా ధ్వజమెత్తారు.

## ఏపీకి మేము వ్యతిరేకం కాదు

హైదరాబాద్, జూన్ 2 (ఈవార్తలు): గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో నిరంకుశ వైఖరి నడిచిందని ఎమ్మెల్సీ, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు కనీసం నిరసన వ్యక్తం చేసుకోవడానికి కూడా ప్రజలకు స్వేచ్ఛ లేకుండా చేశారని మండిపడ్డారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో నిజమైన ప్రజాస్వామ్య స్వేచ్ఛ వచ్చిందని ఆయన పేర్కొన్నారు. నాంపల్లిలోని టీజేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ 12వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, రాష్ట్ర ఆకాంక్షలకు అడ్డుపడితే తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అరవై ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ, ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని కోదండరాం ఈ సందర్భంగా గుర్తుచేశారు. నాడు అప్పటి పాలకులతో ప్రాణాలకు తెగించి కొట్లాడి స్వరాష్ట్రాన్ని తెచ్చుకున్నామని, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందడంలో నాడు యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, అప్పటి ప్రతిపక్ష నేత సుష్మా స్వరాజ్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ సాధనలో ప్రజలు ఏ విధంగా భాగస్వాములయ్యారో, ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధిలో కూడా ప్రజలంతా తమ వంతు సూచనలు, సలహాలు అందించాలని కోరారు. సమసమాజ స్థాపన కోసం సాగే పోరాటంలో కలిసివచ్చే ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తామని, కానీ తెలంగాణ ప్రయోజనాలకు తూట్లు పొడవాలని చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

# రేవంత్కు ఒక రూల్, పవన్కు ఇంకో రూలా

**రఘునందన్ రావు**



హైదరాబాద్, జూన్ 2 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వ్యవహారం చుట్టూ గత కొన్ని రోజులుగా తెలంగాణలో రాజకీయాలు హీటెక్కాయి. పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు, ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసులు, హైదరాబాద్ శివారులో కోడి చెరువు కబ్జా ఆరోపణలు, తెలంగాణలో జనసేన పార్టీ సభ వంటి అంశాలు.. ఇప్పుడు తెలంగాణ పాలిటిక్స్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇక జనసేన సభకు తెలంగాణ పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం, హైకోర్టులో అనుకూలమైన తీర్పు రాకపోవడంతో.. సభను రద్దు చేసుకున్న పవన్ కళ్యాణ్.. హైదరాబాద్‌లోని తన ఇంట్లోనే మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. తనను విమర్శించే వారిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అయితే పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కౌంటర్లు ఇవ్వగా.. బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాత్రం మద్దతుగా నిలిచారు. తెలంగాణలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రెస్‌మీట్ పెట్టుకుంటే.. తెలంగాణ కాంగ్రెస్ నేతలకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వచ్చిన అభ్యంతరం ఏంటో చెప్పాలని రఘునందన్ రావు సూటి ప్రశ్న వేశారు. తాజాగా మీడియాతో మాట్లాడిన బీజేపీ ఎంపీ.. గత రెండున్నరేళ్లుగా తెలంగాణ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న రేవంత్ రెడ్డి.. కొన్ని వందలసార్లు ఢిల్లీకి వెళ్లారని గుర్తు చేశారు. ఆయన ఢిల్లీకి వెళ్లిన ప్రతీసారి.. అక్కడ ప్రెస్‌మీట్ పెట్టడం లేదా అని ప్రశ్నించారు. అలా అయితే.. పక్క రాష్ట్రం వాళ్లు వచ్చి ఇక్కడ తెలంగాణలో ప్రెస్‌మీట్‌లు పెట్టొద్దా అని రఘునందన్ రావు.. రాష్ట్ర ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ కూడా.. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి బీఆర్ఎస్ సభలు పెట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో సభ పెడితే కాంగ్రెస్ నేతలు ఎందుకు భయపడుతున్నారని రఘునందన్ రావు మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ సభ పెట్టినంత మాత్రాన.. ఎవరి ఉనికి ఎవరికీ ప్రమాదం కాదని హితవు పలికారు. చివరికి ప్రజలు ఆశీర్వదించిన వాళ్లే అధికారంలోకి వస్తారని ఎంపీ రఘునందర్ రావు తేల్చి చెప్పారు.

**తెలంగాణ రాష్ట్ర సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

# ఆగస్టు 6 లోపు జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



హైదరాబాద్, జూన్ 2 (ఈవార్తలు): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి రోజైన ఆగస్టు 6వ తేదీ లోపు హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించాలని తెలంగాణ రాష్ట్ర సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై 12 ఏళ్లు పూర్తయినప్పటికీ, స్వరాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతపరమైన వెన్నెముకగా నిలిచిన జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ప్రభుత్వం ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడం తీవ్ర విచారకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ ప్రభుత్వం ఆగస్టు 6 లోపు విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైతే, కనీసం తమ పార్టీకైనా అనుమతి ఇవ్వాలని, తామే స్వయంగా ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. అలాగే తెలంగాణ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూనే, స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు, ఉద్యమకారులకు ఆమె ఘన నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సరైన గుర్తింపు, గౌరవం దక్కాలని ఆమె కోరారు. అలాగే జూలై 2వ తేదీ లోపు అమరవీరుల కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ డిమాండ్లను నెరవేర్చకపోతే, తమ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ భగాయత్ వేదికగా ఒక భారీ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా, పెద్ద ఎత్తున వంటా-వార్పు నిరసన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామని తెలిపారు. అమరవీరుల త్యాగాలను మరవకుండా ఉద్యమ స్ఫూర్తికి అనుగుణంగా పాలన సాగించాలని హితవు పలికారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

చాంద్రాయణగుట్ట, జూన్ 2 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని చాంద్రాయణగుట్ట పరిధిలో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో 70 ఏళ్ల వృద్ధుడికి ప్రత్యేక కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. పోక్సో చట్టం కింద దాఖలైన ఈ కేసులో హైదరాబాద్ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం ఈ కీలక తీర్పును వెలువరించింది. 2023లో చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన మహమ్మద్ జమీరుద్దీన్ (70) అనే వ్యక్తి మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్ట్ చేసి, అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించిన విచారణను ప్రత్యేక పోక్సో కోర్టు నిర్వహించింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడు జమీరుద్దీన్‌ను దోషిగా నిర్ధారించింది. అతనికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

## పవన్ వెనుక అదృశ్య శక్తులు: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, జూన్ 2 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రెండు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పవన్ కల్యాణ్‌పై తనకు ఉన్న వ్యక్తిగత అభిమానానికి, రాజకీయాలకు మధ్య స్పష్టమైన తేడా ఉందని ఆయన పేర్కొన్నారు. పవన్ కల్యాణ్‌ను ఒక నటుడిగా తామంతా ఇష్టపడతామని, అయితే రాజకీయ పరంగా మాత్రం ఆయనను తీవ్రంగా వ్యతిరేకిస్తామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. "పవన్ కల్యాణ్ ఆంధ్ర మూలాలు ఉన్న నాయకుడు. నటుడిగా ఆయనపై మాకు గౌరవం ఉంది, కానీ రాజకీయంగా మేము ఆయనతో విభేదిస్తాం" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్‌లో ఉపముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ.. ఆయనను తెరవెనుక నుంచి ఎవరో వేరే వ్యక్తులు నడిపిస్తున్నారని ఆరోపించారు.

## ఆంధ్రా నేతల విగ్రహాలు పగలగొడితే సీఎం అవుతారా?

**కవితపై బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ఫైర్**

హైదరాబాద్, జూన్ 2 (ఈవార్తలు): తెలంగాణలో ఉన్న ఆంధ్ర నాయకుల విగ్రహాలను పగలగొడతామంటూ తెలంగాణ రక్షణ సమితి పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ బీజేపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తెలంగాణలోని ఆంధ్ర నేతల విగ్రహాలను ధ్వంసం చేసి, వాటిని పార్సిళ్లుగా ఆంధ్రాకు పంపుతామంటూ కవిత చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. "కవిత గారూ.. విగ్రహాలు పగలగొడతాం అని మాట్లాడితే మీరు ముఖ్యమంత్రి అవుతారా? ఇంకా ఎంతకాలం ఇలాంటి సెంటిమెంట్ రాజకీయాలు చేస్తారు?" అంటూ విష్ణువర్ధన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ ఇలాంటి ఉద్రేకపూరిత వ్యాఖ్యలు చేయడం వల్లే కేసులు, జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ద్వేషాన్ని, చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ నేతలతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గట్టిగా స్పందించాలని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. చట్టం అందరికీ సమానంగా ఉండాలని, రెండు రాష్ట్రాల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసేలా ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించకూడదని ఆయన హెచ్చరించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## 'ఓయో' ఐపీఓకు సెబీ గ్రీన్ సిగ్నల్




ముంబై: ఇన్వెస్టర్లను ఊరిస్తూ వస్తున్న ఓయో నుంచి ఎట్టకేలకు ఐపీఓ రాబోతుంది. ఓయో పేరెంట్ కంపెనీ ప్రిజమ్ ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్‌కు తాజాగా మార్కెట్ నియంత్రణ సంస్థ-సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియాఆమోదం లభించింది. ఓయో నుంచి ఐపీఓ వస్తుందని ఎప్పటినుంచో ప్రచారం జరిగినా.. అది కార్యరూపం దాల్చలేదు. మధ్యలో కొన్నిసార్లు ఐపీఓ ప్రణాళికలు వాయిదా పడ్డాయి. ఇప్పుడు సెబీ ఆమోదం నేపథ్యంలో మరికొద్ది నెలల్లో ఈ ప్రిజమ్ ఐపీఓ రానుందని చెప్పొచ్చు. మంచి ఆదరణ ఉన్న సంస్థ కాబట్టి.. ఇన్వెస్టర్ల నుంచి మంచి డిమాండ్ ఉంటుందని చెప్పొచ్చు. వాస్తవానికి జనం ప్రముఖ కంపెనీ ఐపీఓ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. మార్కెట్ పరిస్థితులు బాగోలేనందున పెద్ద పెద్ద కంపెనీలు ప్రస్తుతం ఐపీఓ ప్రాసెస్‌ను వాయిదా వేస్తున్నాయి. ఈ ఐపీఓ పూర్తిగా ఫ్రెష్ ఇష్యూ అంటే కొత్త షేర్ల జారీ ద్వారానే ఉంటుందని పేర్కొంది. అంటే పాత పెట్టుబడిదారులు తమ వాటాల్ని విక్రయించడం లేదు కాబట్టి.. ఆఫర్ ఫర్ సేల్ (రాఫీూ) లేదు. పూర్తిగా కొత్త షేర్లను ఇష్యూ చేసి.. ఐపీఓ ద్వారా రూ. 6,650 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ విలువను సుమారు 7-8 బిలియన్ డాలర్లుగా అంచనా వేస్తున్నారు. భారత కరెన్సీలో చూస్తే ఇది గరిష్ఠంగా రూ. 76 వేల కోట్లకుపైగానే ఉంటుందని తెలుస్తోంది.

## భారీ దెబ్బకొట్టేలా ఎల్‌నినో

**ప్రపంచ దేశాలకు డబ్ల్యూఎమ్ఓ వార్నింగ్**

జెనీవా: ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపే ఎల్ నినో ఈ ఏడాది తిరిగి రానుందని, ఈసారి దాని ప్రభావం మరింత బలంగా ఉండే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎమ్ఓ) హెచ్చరించింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయని, ఇది ఎల్ నినో రాకకు సంకేతమని ఐక్యరాజ్యసమితికి చెందిన ఈ ఏజెన్సీ స్పష్టం చేసింది. డబ్ల్యూఎమ్ఓ తాజా అంచనాల ప్రకారం, జూన్ నుంచి ఆగస్టు మధ్య ఎల్ నినో ఏర్పడేందుకు 80 శాతం అవకాశం ఉండగా, నవంబర్ వరకు ఇది కొనసాగేందుకు 90 శాతం ఆస్కారం ఉంది. సాధారణంగా ప్రతి రెండు నుంచి ఏడేళ్లకోసారి వచ్చే ఈ సహజసిద్ధమైన ప్రక్రియ, ప్రపంచవ్యాప్తంగా వర్షపాత సరళిని దెబ్బతీస్తుంది. కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన కరవులకు, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదలకు కారణమవుతుంది. ఈసారి రాబోయే ఎల్ నినో, ఇప్పటికే పెరిగిన భూతాపంతో జతకలవడంపై శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ఎల్ నినో ప్రభావం మరింత తీవ్రమవుతోందని, దీనివల్ల 2027 సంవత్సరం చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు సృష్టించే ప్రమాదం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎల్ నినో వల్ల కలిగే విపరీత వాతావరణ పరిస్థితులైన వరదలు, కరవులు, తీవ్రమైన వేడిగాలులను ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలు సిద్ధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

## జపాన్‌లో అక్రమ మసీదు నిర్మాణం

**కూల్చివేతకు సిద్ధమవుతున్న అధికారులు**

కవాగోయె: జపాన్‌లోని పాకిస్థానీ వలసదారులకు ఓ మసీదు నిర్మాణం కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. కవాగోయె నగరంలో అక్రమంగా నిర్మించిన ఈ మసీదును కూల్చివేయాలా వద్దా అని అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. విశేషమేమిటంటే, ఏప్రిల్‌లో ఈ మసీదును స్వయంగా జపాన్‌లోని పాకిస్థాన్ రాయబారి అబ్దుల్ హమీద్ ప్రారంభించారు. అయితే, దీని నిర్మాణానికి జపాన్ చట్టాల ప్రకారం అవసరమైన అనుమతులు తీసుకోలేదని స్థానిక అధికారులు తేల్చారు. ఈ వివాదంపై కవాగోయె నగర పాలక సంస్థ స్పష్టమైన ప్రకటన విడుదల చేసింది. "ఈ మసీదును పట్టణ అభివృద్ధి నియంత్రణ ప్రాంతంలో నిర్మించారు. ఇక్కడ సిటీ ప్లానింగ్ చట్టం ప్రకారం ప్రత్యేక అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. కానీ, ఈ భవనాన్ని నగరం నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే నిర్మించారు" అని అధికారులు తెలిపారు. నిబంధనలు సరిదిద్దుకోవాలని సంబంధిత వ్యక్తులకు చాలాసార్లు సూచించినట్లు కూడా పేర్కొన్నారు. ఈ మసీదును కూల్చివేయాలని వచ్చిన ప్రతిపాదనను సమీక్ష కోసం స్వీకరించినట్లు నగర పాలక సంస్థ వెల్లడించింది. ఈ వ్యవహారం పాకిస్థాన్ రాయబార కార్యాలయాన్ని ఇరకాటంలో పడేసింది. దీంతో వారు వెంటనే స్పందించి, జపాన్ చట్టాలను ఉల్లంఘించే ప్రాజెక్టులతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. స్థానిక ప్రభుత్వాల నుంచి అవసరమైన అనుమతులు పొందాకే ప్రార్థనా స్థలాల నిర్మాణం చేపట్టాలని జపాన్‌లోని పాకిస్థానీ సమాజానికి విజ్ఞప్తి చేసింది. అన్ని అనుమతులు ఉన్నాయని తమకు సమాచారం ఇవ్వడంతోనే రాయబారి అబ్దుల్ హమీద్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారని పాకిస్థాన్ ఎంబసీ వివరణ ఇచ్చింది. మరోవైపు, అనుమతులు లేకుండా నిర్మాణం జరపడంతో, సమీపంలో నివసిస్తున్న వారికి సరైన వివరణ ఇచ్చారో లేదో కూడా నిర్ధారించుకోలేకపోతున్నామని కవాగోయె అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ మసీదు భవిష్యత్తుపై నగర పాలక సంస్థ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీంతో ఈ నిర్మాణం నిలుస్తుందా లేదా కూల్చివేస్తారా అన్నది ఉత్కంఠగా మారింది.

## భారతీయులకు జర్మనీ ఎయిర్‌పోర్ట్ ట్రాన్సిట్ వీసా రద్దు

బెర్లిన్: భారత ప్రయాణికులకు జర్మనీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై జర్మనీలోని విమానాశ్రయాల మీదుగా ఇతర దేశాలకు ప్రయాణించే భారతీయులకు ఎయిర్‌పోర్ట్ ట్రాన్సిట్ వీసా అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధన 2026 జూన్ 3 నుంచి అమల్లోకి వస్తుందని ఢిల్లీలోని జర్మన్ రాయబార కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది జనవరిలో జర్మన్ ఫెడరల్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ భారత పర్యటన సందర్భంగా కుదిరిన ఒప్పందంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాయబార కార్యాలయం వివరించింది. భారత్-జర్మనీ సంబంధాలను మరింత బలోపేతం చేయడం, ప్రజల రాకపోకలను సులభతరం చేయడం, ఆర్థిక బంధాలను పటిష్ఠం చేయడంలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీ, మెర్జ్ మధ్య జరిగిన సమావేశంలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు గణనీయంగా పెరగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. 2024లో రికార్డు స్థాయిలో ద్వైపాక్షిక వాణిజ్యం జరిగిందని, 2025లో కూడా అదే సానుకూల ధోరణి కొనసాగుతోందని అన్నారు. ఆ పర్యటనలో భాగంగా వాణిజ్యం, టెక్నాలజీ, ఆరోగ్యం, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాల్లో సుమారు 19 ఒప్పందాలు కుదిరాయి. ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఇరు నేతలు పునరుద్ఘాటించారు.

## సీబీఎస్‌ఈ నూతన చైర్మన్‌గా లోఖండే సీతారామ్

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నూతన చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి లోఖండే ప్రశాంత్ సీతారామ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. మరో ఐఏఎస్ అధికారి వరుణ్ భరద్వాజ్‌ను బోర్డు కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఎస్‌ఈ 12వ తరగతి పరీక్షల మూల్యాంకనంలో ఇటీవల ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానంపై వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు సంస్థ చైర్మన్‌గా ఉన్న రాహుల్ సింగ్, కార్యదర్శి హిమాంశు గుప్తాలపై బదిలీ వేటు వేసిన ప్రభుత్వం.. ఆ స్థానాల్లో కొత్త వారిని నియమించింది.

# మూడేళ్లలో 700 మంది అత్యాచారం

### పాక్ గ్రూమింగ్ గ్యాంగుల దురాగతాలు.. బ్రిటన్ ఎంపీ సంచలన విషయాలు వెల్లడి

లండన్: బ్రిటిష్ ఎంపీ రూపెర్ట్ లోవ్ ఇటీవల చేసిన ప్రసంగం యునైటెడ్ కింగ్‌డమ్‌లో సంచలనం సృష్టిస్తోంది. చిన్నారులపై లైంగిక దోపిడీకు పాల్పడుతోన్న భయంకరమైన 'గ్రూమింగ్ గ్యాంగ్‌ల'పై మళ్లీ చర్చను రాజేసింది. ఈ గ్యాంగ్‌లపై యూకే ప్రభుత్వం జరిపిన దర్యాప్తులో బాలలపై వ్యవస్థీకృత లైంగిక వేధింపులకు పాల్పడేవారు ఎక్కువగా పాకిస్థానీ మూలాలున్న టాక్సీ డ్రైవర్లు, మార్కెట్ వ్యాపారులు' అని తేలింది. ఇటీవలి రూపెర్ట్ లోవ్ పార్లమెంటులో ప్రసంగిస్తూ బాధితులు ఎదుర్కొన్న తీవ్రమైన లైంగిక వేధింపులు, మైనర్ బాలికల గర్భాలు, బెదిరింపులు, పోలీసుల నిర్లక్ష్యం, వ్యవస్థల వైఫల్యాలను సభ ముందు ఉంచారు. లైంగిక దోపిడీపై తాను స్వతంత్రంగా నిర్వహించిన విచారణలో ఈ సాక్ష్యాలు సేకరించినట్లు లోవ్ తెలిపారు. "ఈ ధైర్యవంతులైన బాధితుల గోడు పార్లమెంటు వినాలని, చర్యలు తీసుకోవాలని నేను మనస్ఫూర్తిగా కోరుతున్నాను" అని ఆమె అభ్యర్థించారు. గ్రూమింగ్ గ్యాంగ్‌ల చేతుల్లో బాధితులు ఎదుర్కొన్న హింస, దారుణాలను బయటపెట్టారు. ఓ బాధితురాలు మాట్లాడుతూ "తనకు 12 ఏళ్లు ఉన్నప్పుడు ఒక కామాంధుడు తన ప్రయివేట్ భాగాలపై మద్యం సీసాతో దాడిచేశాడని, ఆ క్రమంలో గాజు ముక్కలు లోపలే విరిగిపోయాయి" అని వాపోయింది. లైంగిక వేధింపులు జరుగుతున్న సమయంలో వివిధ ప్రాంతాల్లోని కొందరు పోలీసు అధికారులు కూడా తనపై అత్యాచారానికి పాల్పడ్డారని మరో బాధితురాలు ఆరోపించింది. "మూడేళ్ల కాలంలో సుమారు 600 నుంచి 700 మంది నాపై అత్యాచారం చేశారు' అని 13 ఏళ్లుగా లైంగిక వేధింపులను ఎదుర్కొన్న మరో మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. నిజం చెప్తే చంపేస్తారనే భయంతో డ్రింక్‌లో ఏదో కలిపారని మాత్రమే వైద్యులకు చెప్పానని, వారు కూడా ఎలాంటి ప్రశ్నలు అడగకుండా కేవలం టాబ్లెట్లు ఇచ్చి డిశ్చార్జ్ చేశారని 15 ఏళ్ల వయసులో దారుణమైన హింసకు గురై ఆసుపత్రి పాలైన ఒక బాలిక వివరించింది. కొన్ని సందర్భాల్లో దారుణాలు మరింత క్రూరంగా మారాయని, బాధితులను జంతువుల కంటే హీనంగా చూశారని వెల్లడైంది.



# బీజేపీకి అన్నామలై రాజీనామా

**అధిష్ఠానానికి ఐదు పేజీల సుదీర్ఘ లేఖ**



చెన్నై: తమిళనాడు బీజేపీ నేత, మాజీ ఐపీఎస్ కే అన్నామలై ఆ పార్టీకి మంగళవారం రాజీనామా చేశారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలను కలిసిన అనంతరం తన రాజీనామా లేఖను సమర్పించారు. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌లకు ఐదు పేజీల లేఖను అన్నామలైన అందజేశారు. అయితే, అన్నామలై రాజీనామాను బీజేపీ అధిష్ఠానం మాత్రం ఆమోదించలేదు. గత రెండు రోజులుగా అన్నామలై రాజీనామాపై ఊహాగానాలు జోరుగా సాగుతున్న సంగతి తెలిసిందే. బీజేపీని వీడి కొత్తగా రాజకీయ వేదికను ఏర్పాటుచేసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. జూన్ 4న తన పుట్టిన రోజు నాడు రాజకీయ భవిష్యత్తుపై అన్నామలై ప్రకటన చేసే అవకాశం ఉంది. మాజీ ఐపీఎస్ అయిన అన్నామలై.. 'లౌకిక', 'తమిళ-కేంద్రీకృత' దృక్పథంతో ఒక కొత్త ప్రాంతీయ పార్టీని ప్రారంభించాలని యోచిస్తున్నట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రతిపాదిత ఈ పార్టీని ఆరు నుంచి ఎనిమిది నెలల్లోగా ప్రారంభించే అవకాశం ఉంది. తమిళనాడులోని బీజేపీ, ద్రావిడ ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అన్నామలై సన్నిహితుల ప్రకారం.. ఆయన తమిళ గుర్తింపును జాతీయ దృక్పథంతో మేళవించి, అదే సమయంలో ప్రత్యర్థి పార్టీలను సమస్యల ఆధారంగా వ్యతిరేకించే ఒక రాజకీయ వేదికను ఊహించుకుంటున్నారు. తమిళనాడులో పార్టీ రాజకీయ వ్యూహంపై అన్నామలైకి, బీజేపీ కేంద్ర నాయకత్వానికి కొన్నాళ్లు నెలకొన్న విభేదాల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే పొత్తును పునరుద్ధరించడం, అసెంబ్లీ ఎన్నికలకు ముందు అభ్యర్థుల ఎంపిక సహా అంశాలపైనా బీజేపీపై అన్నామలై అసంతృప్తిగా ఉన్నారని వర్గాలు తెలిపాయి.

## అప్పు తిరిగి అడగటం నేరం కాదు: బాంబే హైకోర్టు



ముంబై: ఆర్థిక లావాదేవీలు, అప్పుల వసూళ్లకు సంబంధించిన కేసుల్లో బాంబే హైకోర్టు ఒక కీలకమైన తీర్పును వెలువరించింది. ఎవరికైనా ఇచ్చిన అప్పును తిరిగి చెల్లించమని కోరడం లేదా బాకీ డబ్బుల కోసం ఒత్తిడి చేయడం ఎంతమాత్రం ఆత్మహత్యా ప్రేరణ కిందకు రాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఒక వ్యక్తిని బలవన్మరణానికి పురికొల్పేలా ఉద్దేశపూర్వకంగా చేసే చర్యలు మాత్రమే భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 306 పరిధిలోకి వస్తాయని కోర్టు వివరించింది. మహారాష్ట్రకు చెందిన ఓ స్కూల్ టీచర్ ఆత్మహత్య కేసులో నిందితులుగా ఉన్న ఆరుగురికి ఉపశమనం కలిగిస్తూ హైకోర్టు ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన దిలీప్ మాండే అనే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కొందరి వద్ద రుణాలు తీసుకున్నారు. అయితే అప్పు ఇచ్చిన అమిత్ మోరే అనే లెండర్‌తో పాటు ఆయన రికవరీ ఏజెంట్లు తనను నిరంతరం వేధింపులకు గురిచేస్తున్నారంటూ 2022లో దిలీప్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ తీవ్ర ఒత్తిడిని తట్టుకోలేక దిలీప్ మాండే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కొల్హాపూర్ పోలీసులు అమిత్ మోరేతో పాటు మరో ఐదుగురిపై ఐపీసీ సెక్షన్ 306 కింద ఆత్మహత్యా ప్రేరణ కేసు నమోదు చేసి, చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ రంజిత్‌సిన్హా రాజా భోంస్లే నేతృత్వంలోని సింగిల్ బెంచ్ విచారించింది. నిందితులపై నమోదైన చార్జ్‌షీట్‌ను పక్కన పెడుతూ న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. "తాము ఇచ్చిన సొమ్మును తిరిగి ఇవ్వాలని అప్పు తీసుకున్న వ్యక్తిని కోరడం లేదా ఆ బాకీ వసూలు కోసం ఫాలో అప్ చేయడం అనేది ఏ రకమైన ఊహాగానాల్లోనూ ఆత్మహత్యా ప్రేరణ చట్టం పరిధిలోకి రాదు. తమ సొంత డబ్బును తాము వెనక్కి అడిగే హక్కు రుణదాతలకు ఉంటుంది" అని న్యాయస్థానం స్పష్టం చేసింది.

## 2000 ఏళ్ల కిందటే హైడ్రాలిక్ తరహా తవ్వకాలు

**బంగారం కోసం రోమన్ల ఇంజనీరింగ్ అద్భుతం**



లండన్: స్పెయిన్‌లోని పిరనీస్ పర్వత శ్రేణుల్లో దాదాపు 2000 ఏళ్ల నాటి ఓ పురాతన రహస్యం వెలుగులోకి వచ్చింది. అక్కడి పర్వత ప్రాంతంలో ఉన్నది సహజ నిర్మాణం కాదని, రోమన్ల కాలంలో భారీ స్థాయిలో హైడ్రాలిక్ విధానం ఉపయోగించి బంగారం తవ్వకాలు జరిపిన ప్రదేశమని పరిశోధకులు నిర్ధారించారు. లక్షల టన్నుల మట్టిని కదిలించి, పర్వత స్వరూపాన్నే మార్చేసిన ఈ తవ్వకాలు రోమన్ల ఇంజనీరింగ్ నైపుణ్యానికి అద్దం పడుతున్నాయి. స్పెయిన్-ఫ్రాన్స్ సరిహద్దుల్లోని సెర్డాన్యా లోయలో ఉన్న 'గిల్లెటెరెస్ డి ఆల్' అనే ప్రదేశంలో కృత్రిమ కందకాలు, వృత్తాకారంలో ఉన్న లోతైన ప్రాంతంపై పరిశోధకులు దృష్టి సారించారు. 2010 నుంచి 2022 వరకు జరిపిన తవ్వకాల్లో 4.5 మీటర్ల వెడల్పు, 1.5 మీటర్ల లోతు ఉన్న ఓ పురాతన రిజర్వాయర్ బయటపడింది. దీని ఆధారంగా ఆప్టికల్లీ స్టిమ్యులేటెడ్ ల్యూమినిసెన్స్ (ఓఎస్ఎల్) డేటింగ్ పద్ధతి ద్వారా ఈ నిర్మాణం క్రీస్తు శకం 2వ శతాబ్దం చివరి నుంచి 3వ శతాబ్దం మధ్యలో వదిలేసినట్లు గుర్తించారు. రిజర్వాయర్లలో నిల్వ చేసిన నీటిని ఒక్కసారిగా కిందికి వదిలి, ఆ నీటి ప్రవాహపు ఒత్తిడితో బంగారం ఉన్న మట్టిని, రాళ్లను కరిగించేవారు. ఆ తర్వాత కిందికి ప్రవహించిన నీటిలోంచి బంగారు రేణువులను వేరు చేసేవారు. ఈ పద్ధతిలో దాదాపు 20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని కదిలించినట్లు అంచనా. ప్లినీ ది ఎల్డర్ వంటి ప్రాచీన రచయితల గ్రంథాల్లో కూడా ఈ ప్రాంతంలో బంగారం నిక్షేపాలు ఉన్నట్లు ప్రస్తావనలు ఉన్నాయి. సమీపంలో ఓ లోహ పరిశ్రమ, శ్మశానవాటికలో దొరికిన బంగారు కడియం వంటి ఆనవాళ్లు.. ఈ గని అప్పటి రోమన్ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించిందని సూచిస్తున్నాయి.

## 380 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాలతో ముగిశాయి. ఐటీ, మెటల్, కన్జ్యూమర్ డ్యూరబుల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు సానుకూలంగా స్పందించాయి. అయితే, భారత్-అమెరికా మధ్య కీలక వాణిజ్య చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 382.50 పాయింట్లు లాభపడి 74,649.84 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 100.95 పాయింట్లు పెరిగి 23,483.55 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ప్యాక్‌లో టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధాన లాభాల్లో ఉన్నాయి. మరోవైపు, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టాలతో ముగిశాయి.

## 10 మంది మంత్రులతో డీకే ప్రమాణం

బెంగళూరు: కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు మరో 10 మంది మంత్రులు ప్రమాణం చేస్తారని పార్టీ వర్గాల పేర్కొన్నాయి. ఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్‌తో ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మంగళవారం చర్చలు జరిపిన అనంతరం తొలి విడత క్యాబినెట్‌లోకి ఎవరిని తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. మరో వారం పది రోజుల వ్యవధిలోనే క్యాబినెట్ విస్తరణ కూడా ఉంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. బుధవారం మధ్యాహ్నం 4.05 గంటలకు బెంగళూరులోని లోక్ భవన్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ సహా పలువురు హాజరుకానున్నారు. అయితే, డీకే శివకుమార్ క్యాబినెట్ తొలి దశలో 10 నుంచి 20 మంది మంత్రులను చేర్చుకోవాలని ప్రణాళికలు ఉన్నాయి. ప్రాథమిక జాబితా దాదాపు సిద్ధంగా ఉందని, మరికొన్ని పేర్లు ఇంకా పరిశీలనలో ఉన్నాయని ఒక సీనియర్ పార్టీ నేత తెలిపారు. "10 పేర్లను ఖరారు చేయగా, తొలి విడతలో ప్రమాణ స్వీకారం కోసం మరో 10 మంది కోసం చర్చిస్తున్నారు. తుది జాబితా బుధవారం వెలువడవచ్చు" అని ఆయన అన్నారు. అలాగే, కేపీసీసీ అధ్యక్షుడు, అసెంబ్లీ స్పీకర్, శాసన మండలి చైర్మన్ వంటి కీలక సంస్థాగత, రాజ్యాంగ నియామకాలపై కూడా చర్చలు జరిగాయి.

## ఎబోలా ఎఫెక్ట్.. భారత్ అలర్ట్

**బాధిత దేశాల ప్రయాణికులకు ఐసోలేషన్**

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఎబోలా వైరస్ కలకలం రేపుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అంతర్జాతీయంగా పెరుగుతున్న ముప్పును దృష్టిలో ఉంచుకుని మంగళవారం ఒక సరికొత్త హెల్త్ అడ్వైజరీని జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి భారత దేశానికి వచ్చే ప్రయాణికులు లేదా ఆయా దేశాల మీదుగా ప్రయాణించి ఇక్కడికి చేరుకునే వారు తప్పనిసరిగా 'ఐసోలేషన్'లో ఉండాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే ప్రస్తుతానికి భారత దేశంలో ఎలాంటి ఎబోలా పాజిటివ్ కేసులు నమోదు కాలేదని.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ఆ ప్రకటనలో స్పష్టమైన హామీ ఇచ్చింది. కేంద్రం విడుదల చేసిన వివరణాత్మక మార్గదర్శకాల ప్రకారం.. గత 21 రోజులలో ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చిన వారు తమ ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించుకోవాలి. ఒకవేళ వారికి తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, విరేచనాలు లేదా శరీర భాగాల నుంచి అకస్మాత్తుగా రక్తస్రావం కావడం వంటి లక్షణాలు కనిపిస్తే.. వెంటనే ఇతరులకు దూరంగా ఐసోలేట్ కావాలని సూచించింది. ఈ విధమైన లక్షణాలు వ్యక్తమైన వెంటనే స్థానిక ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలని కోరింది.

## హెచ్1బీ టెకీలకు ఎన్విడియా భారీ ప్యాకేజీ

న్యూయార్క్: లేఆఫ్‌ల కారణంగా ఉపాధి కోల్పోయి అమెరికాలో నివసిస్తోన్న భారతీయ హెచ్-1బీ వీసాదారులు 60 రోజుల్లో మరో ఉద్యోగాన్ని వెతుక్కోవాల్సి ఉంటుంది. లేకపోతే ఆ దేశం నుంచి వెళ్లిపోవాల్సిన పరిస్థితి. టెక్ దిగ్గజ సంస్థలన్నీ ఉద్యోగాలకు కోత పెడుతూ, పెద్దగా నియామకాలు చేపట్టకపోవడంతో ఈ వీసాదారులు గందరగోళ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో ఎన్విడియా విదేశీ టాలెంట్‌పై దృష్టిసారించింది. అందులోభాగంగా హెచ్-1బీ వీసాదారుల నియామకాల సంఖ్యను పెంచుతోంది. 2026లో మొదటి రెండు త్రైమాసికాలకు 1200 మంది హెచ్-1బీ కేటగిరీ కింద ఉద్యోగులను తీసుకునేందుకు కావాల్సిన అనుమతులు పొందింది. గతేడాది ఇదే సమయంలో ఆ సంఖ్య వెయ్యిగా ఉంది. ఫెడరల్ ఫైలింగ్స్ కంపెనీ ఈ వివరాలను పేర్కొంది. అమెరికాకు హెచ్-1బీ టాలెంట్‌ను ఎక్కువగా అందిస్తోన్న దేశం భారత్. ఆ వీసాను పొందుతున్న విదేశీయుల్లో భారతీయుల వాటా 70 శాతానికి పైనే ఉంది. అంటే ఆ వీసా కింద నియామకాలు పెరిగితే.. లబ్ధిదారుల్లో ఎక్కువమంది భారతీయులే ఉండే అవకాశం ఉంది.

## నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై భారత్ కౌంటర్

**మూడో దేశం జోక్యం కుదరదని స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: భారత్, నేపాల్ మధ్య ఉన్న సరిహద్దు వివాదం పూర్తిగా ద్వైపాక్షిక అంశమని, ఇందులో మూడో దేశం ప్రమేయానికి ఆస్కారమే లేదని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలను చర్చల ద్వారా, చారిత్రక ఆధారాల ప్రాతిపదికన పరిష్కరించుకోవాలని పేర్కొంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఇటీవల పార్లమెంటులో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ స్పందించింది. సరిహద్దు సమస్య పరిష్కారానికి భారత్, చైనాలతో మాట్లాడడమే కాకుండా, యూకే ప్రభుత్వంతో కూడా మాట్లాడామని చెప్పారు. యూకే ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిసారించాలని కోరుకుంటున్నామని, ఎందుకంటే, భారత్ ను బ్రిటీషర్లు పరిపాలించిన చరిత్రతో ఈ సమస్యకు సంబంధం ఉందని వివరించారు. అంతేకాకుండా, భారత్ తమ భూభాగంలోకి చొరబడినట్లే, నేపాల్ కూడా కొన్ని ప్రాంతాల్లో భారత భూభాగాలను ఆక్రమించుకుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు నేపాల్ పార్లమెంటులో తీవ్ర దుమారం రేపాయి. ప్రభుత్వ వైఖరిని బలహీనపరిచారంటూ ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. దీంతో నేపాల్ విదేశాంగ శాఖ వెంటనే రంగంలోకి దిగి వివరణ ఇచ్చింది. ప్రధాని వ్యాఖ్యలు సరిహద్దులోని 'దస్‌గజ' (నో-మ్యాన్స్ ల్యాండ్) ప్రాంతంలో ఇరు దేశాల పౌరుల భూ వినియోగానికి సంబంధించినవని, అధికారిక ప్రాదేశిక వాదనలకు కాదని పేర్కొంది.

## దావూద్‌కు పాక్ ఐఎస్ఐ అండ

**కరాచీ నుంచే భారత్‌పై కుట్రలు**

ఢిల్లీ పోలీసుల దర్యాప్తులో సంచలన నిజాలు

న్యూఢిల్లీ: అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం పాకిస్థాన్‌లోని కరాచీ నుంచే తన ఉగ్ర కార్యకలాపాలను కొనసాగిస్తున్నాడనే విషయం మరోసారి రుజువైంది. దావూద్ సిండికేట్ నడుపుతున్న ఓ భారీ టెర్రర్ మాడ్యూల్‌ను ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ తాజాగా భగ్నం చేసింది. ఈ కేసులో 8 మందిని అరెస్ట్ చేసి విచారించగా, సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఢిల్లీ, ముంబై నగరాల్లో దాడులకు ఈ ముఠా ప్రణాళిక రచించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల విచారణలో దావూద్ ఇబ్రహీం ఇప్పటికీ కరాచీలోని క్లిఫ్టన్ రోడ్డులోనే నివసిస్తున్నట్లు స్పష్టమైంది. అతని ముఖ్య అనుచరుడైన ముద్దసర్ హుస్సేన్ సయ్యద్ అలియాస్ మున్నా జింగాడాతో తాము టచ్‌లో ఉన్నామని నిందితులు అంగీకరించారు. ఆపరేషన్ మొత్తం క్లిఫ్టన్ రోడ్డు నుంచే జరగడం దావూద్ అక్కడే ఉన్నాడనడానికి బలమైన ఆధారమని ఓ అధికారి పేర్కొన్నారు.

# ప్రగతి పథంలో ప్రజాపాలన

## మాది తెలంగాణ రైజింగ్ -2047 విజన్.. మంత్రి అజారుద్దీన్ వెల్లడి

జగిత్యాల బ్యూరో, జూన్ 2 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ప్రజలకు పారదర్శక ప్రజాపాలన అందిస్తూ 'రైజింగ్ తెలంగాణ-2047' విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిందని, ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని తెలిపారు. మహిళా సాధికారత కోసం ఇందిరా మహిళా శక్తి పథకం కింద వచ్చే ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. జిల్లాలో రైతుల నుంచి వేలాది మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేసినట్లు వెల్లడించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో వేలాది ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయడంతో పాటు మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమన్నారు. అంతకుముందు పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## జూబ్లీహిల్స్‌లో ఘనంగా ఆవిర్భావ వేడుకలు

జూబ్లీహిల్స్-హైదరాబాద్, జూన్ 2 (ఈవార్తలు): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇంచార్జ్ మాగంటి సునీత గోపీనాథ్‌కు అడ్వకేట్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోగుల నవీన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మాగంటి గోపీనాథ్ జయంతి సందర్భంగా వారికి నివాళి అర్పించి.. జూబ్లీహిల్స్ అభివృద్ధికి గోపీనాథ్ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సల్ల శ్రీనివాస్ యాదవ్, అమ్మాజీ, నాగరాజు, ప్రసాద్ చౌదరి, శ్రవణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి పేదకు అండగా కేసీఆర్

**బీఆర్ఎస్ పాలన దేశానికే ఆదర్శం.. మాజీమంత్రి జీవన్ రెడ్డి వెల్లడి**

జగిత్యాల టౌన్, జూన్ 2 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచారని, బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా ఎదిగిందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డిలతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణను కాపాడుకునేందుకు మరో ప్రజా పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వ్యతిరేక శక్తుల కుట్రలను ప్రజల సహకారంతో తిప్పికొడతామని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయని గుర్తుచేశారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు కాంగ్రెస్, బీజేపీల విధానాలే కారణమని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్‌ను తగ్గిస్తే నిత్యావసర వస్తువుల ధరలు కూడా తగ్గే అవకాశం ఉంటుందని అన్నారు. ఉచిత విద్యుత్‌పై ఆంక్షలు విధించే కుట్రలో భాగంగానే ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం, తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసం కేసీఆర్ నాయకత్వంలో మరోసారి ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు.



## ఖబ్రస్తాన్‌కు 10 ఎకరాలు కేటాయించాలి

**మంత్రి అజారుద్దీన్‌కు మైనార్టీ నాయకుల వినతి**

జగిత్యాల టౌన్, జూన్ 2 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగిత్యాలకు విచ్చేసిన రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌లను కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సీనియర్ నాయకుడు, మైనార్టీస్ రైట్స్ ఫోరం తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మీర్ కాజిమ్ అలీ, జగిత్యాల మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు సిరాజుద్దీన్ మన్సూర్, సీనియర్ మైనార్టీ నాయకుడు సలావుద్దీన్ మున్నా తదితరులు గజమాలతో సత్కరించారు. అనంతరం అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, మీర్ కాజిమ్ అలీ ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం సమర్పించారు. జగిత్యాలలో ముస్లిం మైనార్టీల స్మశానవాటిక (ఖబ్రస్తాన్) కోసం 10 ఎకరాల భూమిని కేటాయించాలని, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో మైనార్టీ వర్గాలకు చెందిన బోధన సిబ్బందికి ప్రాధాన్యం కల్పించాలని కోరారు. అలాగే మైనార్టీ రుణాలు, సంక్షేమ పథకాల అమలులో మరింత ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంపై స్పందించిన మంత్రి మహ్మద్ అజారుద్దీన్, జిల్లా కలెక్టర్‌తో చర్చించి ముస్లిం స్మశానవాటిక కోసం 10 ఎకరాల భూమి కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మైనార్టీల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

# ప్రజల గొంతుకగా 'ఉద్యమ కెరటం'

**ఘనంగా 'ఉద్యమ కెరటం'**
**ప్రథమ వార్షికోత్సవ లోగో ఆవిష్కరణ**
**ప్రజా సమస్యల పరిష్కారంలో**
**పత్రిక పాత్ర కీలకం: ఎమ్మెల్యే కోవ లక్ష్మి**



ఆసిఫాబాద్, జూన్ 2 (ఈవార్తలు): ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారంలో 'ఉద్యమ కెరటం' దినపత్రిక కీలక పాత్ర పోషిస్తోందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కొనియాడారు. మంగళవారం ఆమె నివాసంలో 'ఉద్యమ కెరటం' దినపత్రిక ప్రథమ వార్షికోత్సవ లోగోను ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాశ్, వైస్ చైర్‌పర్సన్ ఎండీ అహ్మద్, పత్రిక ఎడిటర్ అబ్దుల్ రహమాన్, స్థానిక కౌన్సిలర్లు, జర్నలిస్టులతో కలిసి ఆమె ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే 'ఉద్యమ కెరటం' దినపత్రిక ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని, విశేష ఆదరణ పొందిందని ప్రశంసించారు. పత్రికలు ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆమె సూచించారు. భవిష్యత్తులో ఈ దినపత్రిక మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, మరింత పేరు గాంచాలని ఆకాంక్షిస్తూ.. పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి ఆమె తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యమ కెరటం ఎడిటర్ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ గడిచిన ఏడాది ప్రయాణం సమస్యల సుడిగుండంలో నలిగిపోతున్న సామాన్యుడి గొంతుకగా నిలిచామన్నారు. గడిచిన ఏడాది కాలంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ, ఎక్కడా రాజీ పడకుండా వార్తలను నిష్పక్షపాతంగా అందించామని , అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని సమాజంలోని అవినీతిపై, అక్రమాలపై మా కలం పోరాటం చేసిందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారంలో మా వంతు పాత్ర పోషించామనే తృప్తి మాకుందని తెలిపారు. ప్రథమ వార్షికోత్సవం సామాజిక స్పృహతో ప్రజలకు చైతన్యవంతులు చేసి ఎందుకు పత్రిక తరపున అనేక కార్యక్రమాలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో రాజంపేట సర్పంచ్ బుర్ర పోచయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు బాలకృష్ణ, నాగుబాయి, రాజంపేట ఉపసర్పంచ్ మామిడి లక్ష్మి, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ప్రకాష్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు రాధాకృష్ణ చారి, బీఆర్ఎస్ నాయకులు అశోక్, సాయి శ్రావణ్, రాజ్ కుమార్ మహిళా నాయకురాళ్లతో పాటు పలువురు జర్నలిస్టులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## గౌడలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలి: వసంత

జగిత్యాల రూరల్, జూన్ 2 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు కాలిపోయిన సుమారు 500 ఈత చెట్లను జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సుమారు 27 కుటుంబాలు ఈత వనాలపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, చెట్లు కాలిపోవడంతో వారి జీవనోపాధి దెబ్బతిన్నదని అన్నారు. ఐదు రోజులైనా అధికారుల స్పందన లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బాధిత గౌడ కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని ఆమె డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెట్టు శిస్తు మాఫీతో పాటు ప్రమాద బీమా ద్వారా గౌడన్నలకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామ సర్పంచ్ సతీష్, గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.



## అభివృద్ధికే మా ప్రాధాన్యం

**జగిత్యాలలో మైనార్టీ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తాం..**
**మంత్రి అజారుద్దీన్ హామీ**

జగిత్యాల టౌన్, జూన్ 2 (ఈవార్తలు): మతాల పేరుతో రాజకీయాలు చేస్తే అభివృద్ధి సాధ్యం కాదని, తాను మత రాజకీయాలకు దూరంగా ఉంటానని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ అన్నారు. జగిత్యాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, ఉద్యమాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 'రైజింగ్ తెలంగాణ' లక్ష్యంతో రాష్ట్రం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని, అందుకే విద్యారంగంలో సంస్కరణలు చేపడుతున్నట్లు తెలిపారు. జగిత్యాల జిల్లాలో మైనార్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని మంత్రి చెప్పారు. జిల్లా కేంద్రంలో ఈద్గా, ఖబ్రస్థాన్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, విద్యార్థుల స్కాలర్‌షిప్ సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జగిత్యాలలో మైనార్టీ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి అజారుద్దీన్ కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు.



## రాష్ట్రంలో బీజేపీయే ప్రత్యామ్నాయం

**ఆవిర్భావ వేడుకల్లో రాచకొండ యాదగిరి బాబు, భోగ శ్రావణి**

జగిత్యాల, జూన్ 2 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి భారతీయ జనతా పార్టీయే ప్రత్యామ్నాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో వారు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఉద్యమకారుల త్యాగాల ఫలితంగా ఆవిర్భవించిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్న హామీ నెరవేరలేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అభివృద్ధి కంటే హామీల ప్రచారానికే పరిమితమైందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీజేపీ కీలక పాత్ర పోషించిందని, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుకు మద్దతు ఇవ్వడం వల్లే ప్రత్యేక రాష్ట్రం సాకారమైందన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏలేటి నరేందర్ రెడ్డి, వేముల శ్రీనివాస్, నిమ్మల నాగరాజు, జుంబర్తి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌తో అమరావతి రైతుల భేటీ

**మా భూములపై దౌర్జన్యం చేస్తున్నారు**
**మాకు తోడుగా నిలవండి**
**వైసీపీ అధినేతకు రైతుల వినతి**


తాడేపల్లి, జూన్ 2 (ఈవార్తలు): ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని అమరావతి ప్రాంత రైతులు కలిశారు. మంగళవారం రోజున తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను కలిసి .. తమ సమస్యలు చెప్పుకున్నారు. అమరావతి కోసం భూములు ఇవ్వని రైతులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందంటూ జగన్ వద్ద వాపోయారు. భూసేకరణకు నోటిఫికేషన్లు ఇస్తున్నారని.. అభివృద్ధి పేరుతో తమ పొలాలను ధ్వంసం చేస్తున్నారని జగన్ దృష్టికి తీసుకువచ్చారు. భూములు ఇచ్చిన వారికి ఆలయ భూములలో ప్లాట్లు ఇస్తామంటున్నారని.. దేవాలయ భూములను కాపాడుకోవటంలో తోడుగా ఉండాలంటూ జగన్‌ను కోరారు. అలాగే తమ సమస్యలపై గళం వినిపించాలని జగన్‌ను కోరారు. ఈ నేపథ్యంలో అమరావతి రైతులకు ధైర్యం చెప్పిన జగన్.. తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. అమరావతిపై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతిలోని రైతులను ఇబ్బంది పెట్టడం సరైంది కాదన్న ఆయన.. వారి అభిప్రాయాల మేరకు ముందుకెళ్తామని స్పష్టం చేశారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం తొలుత తీసుకున్న 50 వేల ఎకరాలకే దిక్కులేదని.. ఇప్పుడు రెండో విడతలో మళ్లీ భూసమీకరణ అంటున్నారని విమర్శించారు. విజయవాడలో ఇప్పటికే విమానాశ్రయం అందుబాటులో ఉంటే.. మళ్లీ మరో ఎయిర్ పోర్టు అంటున్నారని విమర్శించారు. అమరావతిలో కనీస మౌలిక సదుపాయాల కల్పనకే రెండు లక్షల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని జగన్ వివరించారు. జీవితమంతా రోడ్లు, డ్రైనేజీలు, నీళ్లు, కరెంట్ ఇవ్వటానికే సరిపోతుందని అభిప్రాయపడ్డారు.

# అమరుల త్యాగాలు చిరస్మరణీయం

**ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**



మెట్‌పల్లి, జూన్ 2 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సోమవారం పలు ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మెట్‌పల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా, బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో జాతీయ జెండాను ఎగురవేసి సిబ్బంది, ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తదుపరి కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకున్నారు. అనంతరం కోరుట్ల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కోరుట్ల నలంద హైస్కూల్‌లో నిర్వహించిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



## దుమాల రాజ్‌కుమార్‌కు శుభాకాంక్షలు

జగిత్యాల టౌన్, జూన్ 2 (ఈవార్తలు): డీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా నియామకం పొందిన దుమాల రాజ్‌కుమార్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజర్ ఉద్దీన్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, సేవాదళ్ అధ్యక్షుడు ముకేశ్ కన్నా, ఎన్ఎస్‌యూఐ టౌన్ అధ్యక్షుడు భార్గవ్, అడ్లూరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## లవ్లీ చిత్రం


కాజల్ అగర్వాల్




## క్రేజీ ట్రయాంగిల్ లవ్.. 'కాక్‌టెయిల్ 2'

బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్, స్టార్ హీరోయిన్లు కృతి సనన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో రాబోతున్న చిత్రం కాక్‌టెయిల్ 2. జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. 2012లో సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొణె, డయానా పెంటీ కాంబినేషన్‌లో వచ్చి సూపర్ హిట్ 'కాక్‌టెయిల్' సినిమాకు ఇది సీక్వెల్‌గా వస్తోంది. హోమి అదజానియా దర్శకత్వం వహించిన ఈ చిత్రం, ఇటలీలోని అందమైన లోకేషన్ల నేపథ్యంలో స్నేహం, ప్రేమతో కూడిన ఒక కాంప్లికేటెడ్ ట్రయాంగిల్ లవ్ స్టోరీగా ఈ సినిమా రాబోతుంది. ఈ ట్రైలర్ చూస్తుంటే రష్మిక -- షాహిద్ ప్రేమికుల కనిపిస్తుండగా కృతి సనన్ స్నేహితురాలిగా కనిపించబోతుంది. అయితే స్నేహంతో మొదలైన వీరి ప్రయాణం ఎలాంటి కాంప్లికేటెడ్ లవ్ ట్రయాంగిల్‌గా మారుతుంది అనేది సినిమా కథ. ఈ ట్రైలర్‌లో ఫస్ట్ పార్ట్‌లోని సూపర్ హిట్ సాంగ్ తుమ్ హీ హో బంధు రీమిక్స్ వెర్షన్ పాత జ్ఞాపకాలను గుర్తుచేస్తూ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. దినేష్ విజన్, లవ్ రంజన్, ప్రమిత ఆర్ విజన్, అంకుర్ గార్గ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రీతమ్ సంగీతం అందిస్తున్నారు.

## సుస్మితాసేన్ వజ్రం

సుస్మితా సేన్– లలిత్ మోదీల బ్రేకప్ వివాదానికి ఎట్టకేలకు వ్యాపారవేత్త, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ.. ప్రముఖ బాలీవుడ్ నటి సుస్మితా సేన్‌ల రిలేషన్‌షిప్ 2022లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మాల్దీవులు, సార్డీనియా వంటి విదేశీ వెకేషన్ల నుండి ఈ జోడీ షేర్ చేసిన రొమాంటిక్ ఫోటోలు అప్పట్లో నెట్టింట వైరల్



అయ్యాయి. అయితే అందరినీ షాక్‌కు గురిచేసిన ఈ ప్రేమాయణం చాలా తక్కువ కాలంలోనే ముగిసిపోయింది. అప్పట్లో వీరిద్దరూ విడిపోవడానికి గల కారణాలపై ఎన్నో ఊహాగానాలు చెలరేగగా, దాదాపు నాలుగేళ్ల తర్వాత లలిత్ మోదీ తమ బ్రేకప్ వెనుక ఉన్న అసలు నిజాన్ని బహిరంగంగా వెల్లడించారు. ఇటీవల హ్యూమన్స్ ఆఫ్ బాంబేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో లలిత్ మోదీ మాట్లాడుతూ... ఆ సమయంలో సుస్మితా సేన్‌ను నెటిజన్లు గోల్డ్ డిగ్గర్ (డబ్బు కోసం ఆశపడే వ్యక్తి) అని ట్రోల్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సుస్మిత చాలా అందమైన, స్వశక్తితో ఎదిగిన సంపన్న మహిళ అని ఆయన కొనియాడారు. తనకు తెలిసిన వారిలో ఆమె వద్దే అత్యధికంగా వజ్రాలు ఉన్నాయని, ఎవరి దగ్గరి నుండి ఏమీ ఆశించే మనస్తత్వం ఆమెది కాదని స్పష్టం చేశారు. తామిద్దరూ కలిసి బయటకు వెళ్లినప్పుడు చాలాసార్లు సుస్మితా సేనే బిల్లులు చెల్లించేదని... ఆ సమయంలో తాను కేవలం ఒక కెప్ట్ బాయ్‌ఫ్రెండ్లా ఉన్నానని మోదీ నవ్వుతూ గుర్తుచేసుకున్నారు. ట్రోలర్లకు గట్టి కౌంటర్ ఇస్తూ– సుస్మిత గోల్డ్ డిగ్గర్ కాదు.. నిజానికి లలిత్ మోదీనే ఒక డైమండ్ డిగ్గర్, ఆ వజ్రమే సుస్మితా సేన్" అని ఆయన వ్యాఖ్యానించారు.



## నా భార్య ప్రశ్న నా జీవితాన్నే మార్చేసింది: మాధవన్

తన భార్యతో బంధం బలంగా నిలవడానికి కారణం ప్రేమ కంటే ఎక్కువగా పరస్పర గౌరవమేనని మాధవన్ అనేక సందర్భాల్లో చెప్పారు. సరితకు తాను స్టార్ కాదని, తనతో ప్రేమలో పడిన వ్యక్తిని మాత్రమేనని, ఆమెను సమాన భాగస్వామిగా చూస్తానని ఆయన చెప్పిన మాటలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. భార్యను ప్రత్యేకంగా భావించడమే కాకుండా, తన లైఫ్ లో వచ్చిన ప్రతి సక్సెస్‌కు ఆమెనే కారణమని బహిరంగంగానే చెబుతుంటారు. మాధవన్ పర్సనల్ లైఫ్ లో మరో కీలక మలుపు డైరెక్టర్ మణిరత్నం ఇచ్చిన సలహాతో వచ్చింది. షూటింగ్స్ టైమ్ లో ఫ్యామిలీకి దూరంగా ఉండటం రిలేషన్స్ ను దెబ్బతీయవచ్చని సూచించిన మణిరత్నం మాటలను ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. అప్పటి నుంచి సాధ్యమైనంత వరకు సరితను తనతో పాటూ షూటింగ్‌లకు తీసుకెళ్లేవారట. గ్లామర్ ప్రపంచంలో ఎదురయ్యే ఆకర్షణలకు దూరంగా ఉండటమే కాకుండా, దాంపత్య బంధాన్ని మరింత బలపర్చడంలో ఆ నిర్ణయం కీలక పాత్ర పోషించిందని మాధవన్ చెప్తుంటారు. అయితే మాధవన్ జీవితాన్ని నిజంగా మార్చింది సరిత అడిగిన ఒక ప్రశ్న అని చెప్పాలి. ఒక దశలో వర్క్ పై తన దృక్పథం మారిపోయిందని గమనించిన ఆమె, నీకు ఏమైందని ప్రశ్నించిందని, నువ్వు పని చేయడానికి వెళ్లడం కాదు, అక్కడి నుంచి తిరిగి రావడానికి వెళు_న్నట్టు కనిపిస్తున్నావని చెప్పిన ఆ మాటలు తనను లోతుగా ఆలోచింపజేశాయని మాధవన్ వెల్లడించారు. ఆ ఇన్సిడెంట్ తర్వాతే ఆయన కెరీర్, వ్యక్తిగత జీవితంలో సమతుల్యత గురించి మరింత శ్రద్ధ పెట్టారని పేర్కొన్నారు.

## అచ్చియమ్మ.. బుజ్జి బుజ్జి మాటలు

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ పెద్ది ప్రీ-రిలీజ్ వేడుక విజయవాడలో కన్నులపండువగా జరిగింది. ఈ వేడుకలో చిత్ర కథానాయిక జాన్వీ కపూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యంగా స్టేజ్ పై ఈ ముంబై బ్యూటీ తెలుగులో మాట్లాడిన తీరు అక్కడికి వచ్చిన అభిమానులను , నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంది. జాన్వీ కపూర్ తన ముద్దుముద్దు తెలుగు మాటలతో వేదికపై ఉన్న వారందరినీ అలరించడమే కాకుండా.. సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశారు. ఈ ఈవెంట్‌లో జాన్వీ కపూర్ మాట్లాడుతూఅందరికీ నమస్కారం. మీరు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆదరణ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. పెద్ది సినిమా చూసిన తర్వాత కూడా ఇదే ప్రేమతో థియేటర్ల నుంచి బయటకు వస్తారని ఆశిస్తున్నాను అంటూ ఎంతో క్యూట్‌గా ప్రసంగాన్ని ప్రారంభించారు. మీ ప్రేమ, అభిమానమే మమ్మల్ని మరింత కష్టపడి పనిచేసేలా చేస్తుందని... ఈ సినిమా తన జీవితంలో ఎంతో స్పెషల్ అని జాన్వీ చెప్పుకొచ్చారు. మన జీవితానికి అర్థం ఏమిటి? మన గుర్తింపు అంటే ఏమిటి? అనే ఆసక్తికరమైన అంశాలను పెద్ది చిత్రంలో అద్భుతంగా ఆవిష్కరించినట్లు జాన్వీ తెలిపారు. తన ముద్దుముద్దు తెలుగు ప్రసంగానికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్స్‌ను జాన్వీ కపూర్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. తెలుగు మాటలు క్యూట్ గా... అంటూ తన సోషల్ మీడియా ఫాలోవర్స్ – స్నేహితుల కోసం ఈ ప్రత్యేకమైన పోస్ట్‌ను షేర్ చేసారు. ఈ వీడియో సోషల్ మీడియాలో షేర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే విపరీతంగా వైరల్ అయింది. జాన్వీ క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ..తను పలికిన తెలుగు పదాలకు బాలీవుడ్, టాలీవుడ్ స్నేహితులతో పాటు అభిమానులు సైతం లైకులు, కామెంట్లతో సోషల్ మీడియాను ఊపేస్తున్నారు.





## నేను సింగిల్ టేక్ యాక్టర్‌ని

టాలీవుడ్‌లో పాత్ర ఏదైనా దానికి ప్రాణం పోసే యాక్టర్ల లిస్ట్ లో సీనియర్ నటుడు జగపతిబాబు పేరు ముందు వరుసలో ఉంటుంది. హీరోగా కెరీర్ ప్రారంభించి, తరువాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గా, ఎమోషనల్ క్యారెక్టర్లతో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆయన, ఇప్పుడు పెద్ది సినిమాతో మరోసారి తన టాలెంట్ ను చాటుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో వైరలవుతున్న ఓ ప్రచారంపై స్పందించిన జగపతిబాబు, తనపై వస్తున్న అసత్య కథనాలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. అయితే రీసెంట్ గా జగపతిబాబు ఓ సీన్ కోసం ఏకంగా 72 టేక్స్ తీసుకున్నారనే ప్రచారం జరిగింది. ఈ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో అభిమానుల్లోనూ చర్చకు దారితీసింది. అయితే ఈ విషయంపై స్పందించిన జగపతిబాబు, అలాంటి ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఒక నటుడి పనితీరును అర్థం చేసుకోకుండా ఇలాంటి పుకార్లు సృష్టించడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. సాధారణంగా తాను రెండు టేక్స్‌లోనే సన్నివేశాన్ని పూర్తి చేస్తానని, అత్యవసర పరిస్థితుల్లో మూడో టేక్ మాత్రమే అవసరమవుతుందని వెల్లడించారు. తనపై వచ్చిన పుకార్ల గురించి మాట్లాడుతూ, అదంతా నాన్సెన్స్ అని, పిచ్చి కుక్కలు ఏదోకటి వాగుతుంటాయి, మొరుగుతుంటాయి. అవన్నీ నిజాలెలా అవుతాయని ప్రశ్నించారు. 72 టేక్స్ తీసుకున్నాడని అనడంలో అసలు అర్థముందా అంటూ ఫైర్ అయ్యారు. మ్యాగ్జిమమ్ 3 టేక్స్ తీసుకుంటారు. నా సైడ్ నుంచి 2 టేక్స్ మాత్రమే తీసుకుంటానని చెప్తూ, యాక్టింగ్ లో ఎక్స్‌పీరియెన్స్, పాత్రపై అవగాహన, భావోద్వేగాలను కచ్చితంగా వ్యక్తీకరించే సామర్థ్యం ఉంటే అనవసరంగా ఎక్కువ టేక్స్ అవసరం ఉండదని జగపతిబాబు వ్యాఖ్యానించారు.



## ఈషాపై నెటిజన్ల ఫైర్

టాలీవుడ్ హీరోయిన్లు సినిమా అవకాశాలు రాకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా డబ్బులు సంపాదించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్తగా వచ్చిన సబ్‌స్క్రిప్షన్ అనే ఆప్షన్‌ను వాడుకుంటూ ఆదాయం పొందుతున్నారు. ఈ పద్ధతిలో హీరోయిన్ల పర్సనల్ ఫోటోలు, వీడియోలు చూడాలంటే అభిమానులు ప్రతి నెల కొంత డబ్బులు కట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల ఈ సబ్‌స్క్రిప్షన్ ద్వారా నెలకు ఒక్కో ఫాలోవర్ నుండి రూ. 299 వసూలు చేస్తోంది. అలాగే రామ్ చరణ్ 'చిరుత' సినిమా హీరోయిన్ నేహా శర్మ కూడా ఇదే బాటలో నడుస్తూ డబ్బు సంపాదిస్తోంది. తాజాగా, మన తెలుగు బ్యూటీ ఈషా రెబ్బా కూడా ఇదే ట్రెండ్‌ను ఫాలో అవుతుండటం ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఈషా రెబ్బా మిగతా హీరోయిన్ల కంటే ఒక అడుగు ముందుకు వేసి, తన ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్ కోసం నెలకు ఏకంగా రూ. 390 ఛార్జ్ చేస్తోంది. గత ఏడాది 'ఓంశాంతి శాంతి శాంతి' అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించిన ఈ అమ్మడికి, ప్రస్తుతం టాలీవుడ్‌లో పెద్దగా అవకాశాలు లేవు.







# భారత్‌లో భారత్‌కే ఆఫ్ఘనిస్థాన్ ఆతిథ్యం!

**సెప్టెంబర్‌లో ఢిల్లీ వేదికగా మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్.. భారత గడ్డనే 'హోమ్ గ్రౌండ్'గా వాడుకోనున్న ఆఫ్ఘనిస్థాన్**

**బీసీసీఐ, ఏసీబీల మధ్య బలమైన సంబంధాలకు ఇది నిదర్శనం.. ఈ నెలలో టెస్టు, వన్డే సిరీస్ కోసం ఆఫ్ఘన్ జట్టు భారత పర్యటన**

క్రికెట్ చరిత్రలో ఒక అరుదైన, ఆసక్తికరమైన ఘట్టానికి రంగం సిద్ధమవుతోంది. ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ జట్టు తొలిసారిగా టీమిండియాకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. అయితే విశేషం ఏమిటంటే.. ఈ చారిత్రక 'హోమ్' సిరీస్‌కు వేదికగా నిలవబోయేది కూడా భారత దేశమే. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను నిర్వహించేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయి. బీసీసీఐ, ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) మధ్య ఉన్న బలమైన స్నేహపూర్వక సంబంధాల నేపథ్యంలో ఈ సిరీస్ సాధ్యమవుతోంది. రిటర్న్ టూర్‌లో భాగంగా ఈ సిరీస్‌ను నిర్వహించాలని ఏసీబీ చేసిన ప్రతిపాదనకు బీసీసీఐ సూత్రప్రాయంగా అంగీకరించింది. ఇరు బోర్డుల మధ్య ఇప్పటికే ఒక అవగాహన కుదిరిందని, లాంఛనాలు పూర్తయిన తర్వాత అధికారిక ప్రకటన వెలువడుతుందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఐర్లాండ్, శ్రీలంక, జింబాబ్వే వంటి బోర్డులకు ఆర్థికంగా, క్రీడాపరంగా అండగా నిలిచేందుకు బీసీసీఐ గతంలోనూ ఇటువంటి సిరీస్‌లు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సిరీస్ కోసం వేదికను ఖరారు చేసేందుకు బీసీసీఐయే చొరవ తీసుకుని ఏసీబీ, ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్



అసోసియేషన్ (డీడీసీఏ) మధ్య చర్చలు జరిపింది. సెప్టెంబర్ 13, 16, 19 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. ఈ సిరీస్ కోసం డీడీసీఏ తమ స్థానిక ఢిల్లీ ప్రీమియర్ లీగ్ టీ20 షెడ్యూల్‌ను కూడా సర్దుబాటు చేస్తోంది. స్వదేశంలో రాజకీయ అస్థిరత, భద్రతా కారణాల వల్ల ఆఫ్ఘనిస్థాన్ గత దశాబ్ద కాలంగా తమ అంతర్జాతీయ 'హోమ్' మ్యాచ్‌లను భారత్, యూఏఈలలో ఆడుతోంది. గతంలో 2017లో ఐర్లాండ్‌తో గ్రేటర్ నోయిడాలో, 2018లో బంగ్లాదేశ్‌తో డెహ్రాడూన్‌లో సిరీస్‌లు ఆడింది. ఇదిలా ఉంటే.. ఈ టీ20 సిరీస్ కంటే ముందే ఆఫ్ఘన్ జట్టు మరో సుదీర్ఘ పర్యటన కోసం భారత్‌కు రానుంది. జూన్ 6 నుంచి 20 మధ్య ఒక టెస్టు మ్యాచ్, మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొంటుంది. ఈ రెండు ఫార్మాట్లలోనూ హష్మతుల్లా షాహిదీ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. జూన్ 6న న్యూ చండీగఢ్‌లో ఏకైక టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుండగా.. జూన్ 14, 17, 20 తేదీల్లో ధర్మశాల, లక్నో, చెన్నై వేదికలుగా మూడు వన్డేలు జరగనున్నాయి.



## కృనాల్ పాండ్యా అరుదైన ఘనత

ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఆటగాళ్ల జాబితాలో ఆల్ రౌండర్ కృనాల్ పాండ్యా చోటు దక్కించుకున్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వరుసగా రెండోసారి ఛాంపియన్ గా నిలవడంతో కృనాల్ తన కెరీర్ లో ఐదో ఐపీఎల్ టైటిల్ ను సొంతం చేసుకున్నాడు. తద్వారా ఐపీఎల్ లో ఐదు లేదా అంతకంటే ఎక్కువ టైటిళ్లు గెలిచిన ఆటగాళ్ల ఎలైట్ క్లబ్ లో చేరాడు. ఐపీఎల్ లో అత్యధిక టైటిళ్లు గెలిచిన ఆటగాళ్లుగా రోహిత్ శర్మ, అంబటి రాయుడు (చెరో 6 టైటిళ్లు) అగ్రస్థానంలో ఉన్నారు. వీరి తర్వాత ఐదు టైటిళ్లతో ఎంఎస్ ధోనీ, హార్దిక్ పాండ్యా, కీరన్ పొలార్డ్, జస్ప్రీత్ బుమ్రా ఉన్నారు. ఇప్పుడు కృనాల్ పాండ్యా కూడా ఈ జాబితాలో చేరి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. గతంలో ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతూ 2017, 2019, 2020లో మూడు టైటిళ్లు గెలిచిన కృనాల్, 2025లో ఆర్సీబీ జట్టులోకి వచ్చాక ఆ జట్టుకు వరుసగా రెండు టైటిళ్లు (2025, 2026) అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఒకప్పుడు ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించిన కృనాల్, 2025లో ఆర్సీబీకి మారడం అతని కెరీర్ కు, జట్టుకు కూడా కలిసొచ్చింది. 2025 ఫైనల్ లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' గా నిలిచిన అతను, 2026 సీజన్ లోనూ తన ఆల్ రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఈ సీజన్ లో 226 పరుగులు చేయడంతో పాటు 14 వికెట్లు పడగొట్టి జట్టు టైటిల్ నిలబెట్టుకోవడంలో సహాయపడ్డాడు. ఫైనల్ మ్యాచ్ లో కూడా పొదుపుగా బౌలింగ్ చేసి జట్టు విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. ఈ విజయంతో ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ తర్వాత వరుసగా రెండుసార్లు ఐపీఎల్ టైటిల్ గెలిచిన మూడో జట్టుగా ఆర్సీబీ చరిత్ర సృష్టించింది. మ్యాచ్ అనంతరం కృనాల్ పాండ్యా తన ఆనందాన్ని పంచుకున్నాడు. "ప్రతి ఐపీఎల్ ట్రోఫీ ప్రత్యేకమైనదే. ఇది పిల్లలకు జన్మనిచ్చినట్టుగా ఉంటుంది, ఎవరినీ ఎంచుకోలేం... దేనికదే ప్రత్యేకం.




## టీమిండియాకు కొత్త స్పిన్ కోచ్‌గా సాయిరాజ్

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. టీమిండియా సీనియర్ పురుషుల జట్టు స్పిన్ బౌలింగ్ కోచ్‌గా భారత మాజీ లెగ్ స్పిన్నర్ సాయిరాజ్ బహుతులేను నియమించింది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్ నుంచి బహుతులే బాధ్యతలు స్వీకరించనున్నాడు. భారత జట్టు స్పిన్ వనరులను బలోపేతం చేసే వ్యూహంలో భాగంగా ఈ నియామకం జరిగింది. 53 ఏళ్ల బహుతులే 2001-2003 మధ్య కాలంలో భారత్ తరఫున రెండు టెస్టులు, ఎనిమిది వన్డేలకు ప్రాతినిధ్యం వహించాడు. సుదీర్ఘమైన ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో 630 వికెట్లు పడగొట్టి, 6,176 పరుగులు సాధించాడు. ఆ తర్వాత కోచ్‌గా విదర్భ, కేరళ, గుజరాత్, బెంగాల్ జట్లకు పనిచేశాడు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్‌కు కూడా సేవలందించాడు. 2022లో అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. ప్రస్తుత కోచింగ్ బృందంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్, ఫాస్ట్ బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్‌తో కలిసి బహుతులే పనిచేయనున్నాడు. పలు సందర్భాలలో ఇండియా 'ఏ' మరియు సీనియర్ పురుషుల జట్లకు స్పెషలిస్ట్ బౌలింగ్ కోచ్‌గా పనిచేశాడు. 2021 నుంచి 2024 వరకు బీసీసీఐకి చెందిన నేషనల్ క్రికెట్ అకాడమీ కోచింగ్ సిబ్బందిలో కీలక సభ్యుడిగా ఉన్నాడు.



## ప్రపంచ స్టార్ వైభవ్

ఐపీఎల్ సృష్టికర్త, మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ, కేవలం 15 ఏళ్ల వయసులోనే క్రికెట్ ప్రపంచాన్ని తన అద్భుతమైన బ్యాటింగ్‌తో ఉర్రూతలూగిస్తున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైభవ్ భవిష్యత్తులో ప్రపంచ నంబర్ వన్ సూపర్ స్టార్ అవుతాడని, హాలీవుడ్, బాలీవుడ్ తారలను సైతం మించిపోతాడని ఆయన జోస్యం చెప్పారు. అయితే, అదే సమయంలో అకస్మాత్తుగా వచ్చిపడే డబ్బు, కీర్తి విషయంలో జాగ్రత్తగా ఉండాలని యువ ఆటగాడికి హితవు పలికారు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ, 237.31 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్‌తో పాటు 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్' అవార్డును కూడా గెలుచుకున్నాడు. ఈ నేపథ్యంలో విస్డెన్‌కు ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో లలిత్ మోదీ మాట్లాడుతూ వైభవ్‌పై తన అంచనాలను వెల్లడించారు. "సూర్యవంశీ.. నువ్వు టీ20ల్లో కచ్చితంగా డబుల్ సెంచరీ సాధిస్తావు. నీకు నేను ఆ హామీ ఇస్తున్నాను. అయితే, డబ్బును మాత్రం తలకెక్కించుకోవద్దు. నువ్వు ఈ గ్రహం మీదనే నంబర్ వన్ సూపర్ స్టార్ అవుతావు. ఏ హాలీవుడ్ లేదా బాలీవుడ్ స్టార్ కూడా నీ ముందు సరిపోరు. నా మిత్రుడు క్రిస్ గేల్‌ను కూడా అధిగమిస్తావు. బయటి విషయాలను పట్టించుకోకుండా మనస్ఫూర్తిగా ఆడు" అని మోదీ పేర్కొన్నారు. క్రిస్ గేల్ వాడిన బ్యాట్‌ను తాను ఎంతో ఇష్టంగా తన వద్ద ఉంచుకున్నానని కూడా మోదీ గుర్తుచేసుకున్నారు. బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ, తన 13 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ వేలంలో చోటు దక్కించుకుని చరిత్ర సృష్టించాడు. అతడిని రాజస్థాన్ రాయల్స్ రూ.1.1 కోట్లకు కొనుగోలు చేసింది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత పిన్న వయసులో వేలంలో అమ్ముడైన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈ సీజన్‌లో తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఏకంగా 65 సిక్సర్లు బాది, దిగ్గజ ఆటగాళ్లైన క్రిస్ గేల్, సచిన్ టెండూల్కర్ వంటి వారితో పోలికలను అందుకున్నాడు. అతని నిర్భయమైన ఆట తీరు, అద్భుతమైన ప్రతిభ యావత్ భారత క్రికెట్ అభిమానులలో కొత్త ఆశలు రేకెత్తించాయి.

## రెట్టింపైన వైభవ్ బ్రాండ్ ఎండార్స్‌మెంట్ ఫీజులు

భారత క్రికెట్ ప్రపంచంలో ఓ కొత్త సంచలనం మొదలైంది. కేవలం 15 ఏళ్లకే తన విధ్వంసకర బ్యాటింగ్‌తో అందరి దృష్టినీ ఆకర్షించిన యువ కెరటం వైభవ్ సూర్యవంశీ, ఇప్పుడు కమర్షియల్ ప్రపంచంలోనూ ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. ఐపీఎల్ 2026లో అద్భుత ప్రదర్శనతో ఆరెంజ్ క్యాప్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ (ఎంవీపీ ) టైటిళ్లను గెలుచుకున్న ఈ కుర్రాడి బ్రాండ్ విలువ అమాంతం పెరిగిపోయింది. అతను తన బ్రాండ్ ఎండార్స్‌మెంట్ ఫీజులను దాదాపు రెట్టింపు చేసినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్, ఏకంగా 237.30 స్ట్రైక్ రేట్‌తో 776 పరుగులు సాధించి రికార్డు సృష్టించాడు. అతని దూకుడైన ఆటతీరుకు క్రికెట్ అభిమానులే కాదు, కార్పొరేట్ బ్రాండ్లు సైతం ఫిదా అయ్యాయి. ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్‌తో రూ. 1.10 కోట్ల వార్షిక కాంట్రాక్టుపై ఉన్న వైభవ్, భవిష్యత్తులో ఐపీఎల్ వేలంలోకి వస్తే సుమారు రూ. 30 కోట్లు పలకవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మైదానంలో పరుగుల వరద పారించిన ఈ యువ సంచలనం, ఇప్పుడు బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల రూపంలో కోట్లు ఆర్జిస్తున్నాడు. ఎన్డీటీవీ కథనం ప్రకారం, ఐపీఎల్ ప్రారంభానికి ముందు వైభవ్ ఒక్కో బ్రాం కానీ, ఐపీఎల్‌లో అసాధారణ ప్రదర్శన తర్వాత అతని రేంజ్ మారిపోయింది. ప్రస్తుతం ఒక్కో ఎండార్స్‌మెంట్‌కు రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. "ఐపీఎల్‌కు ముందు అతను కొన్ని బ్రాండ్లతో రూ. కోటి రేంజ్‌లో ఒప్పందాలు చేసుకున్నాడు. కానీ, ఇప్పుడు రూ. 1.5 నుంచి 2 కోట్ల వరకు ఆశిస్తున్నాడు" అని ఓ నిపుణుడు ఎన్డీటీవీకి తెలిపారు.

## చండీగఢ్ చేరుకున్న టీమిండియా

**గిల్ కెప్టెన్సీలో ఆఫ్ఘనిస్థాన్‌తో ఏకైక టెస్టు**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 ముగిసిన తర్వాత భారత క్రికెట్ జట్టు తిరిగి టెస్ట్ ఫార్మాట్‌పై దృష్టి సారించింది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్ కోసం శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా మంగళవారం చండీగఢ్‌కు చేరుకుంది. ఇక్కడి ముల్లన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జూన్ 6, శనివారం నుంచి ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. నగరానికి చేరుకున్న భారత జట్టు నేరుగా టీమ్ హోటల్‌కు వెళ్లింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు కొత్తగా వైస్ కెప్టెన్ బాధ్యతలు చేపట్టిన కేఎల్ రాహుల్, వికెట్ కీపర్-బ్యాటర్ రిషభ్ పంత్, యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి తదితరులు జట్టుతో పాటు కనిపించారు. రాబోయే రోజుల్లో జట్టు ప్రాక్టీస్ సెషన్లను ప్రారంభించనుంది. గత ఏడాది స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో 2-0 తేడాతో ఓటమి పాలైన తర్వాత భారత్ ఆడుతున్న తొలి టెస్టు మ్యాచ్ ఇదే. ఈ మ్యాచ్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పరిధిలోకి రానప్పటికీ, ఈ ఏడాది చివర్లో శ్రీలంక, న్యూజిలాండ్ పర్యటనలకు సన్నాహకంగా ఇది టీమిండియాకు చాలా కీలకం. అనుభవం, యువ ప్రతిభ కలయికతో ఉన్న ఈ జట్టుతో టెస్టుల్లో తిరిగి లయను అందుకోవాలని భారత్ భావిస్తోంది. భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య టెస్టుల్లో ఇది రెండో ముఖాముఖి. 2018లో బెంగళూరు వేదికగా ఆఫ్ఘనిస్థాన్ తమ అరంగేట్ర టెస్టును భారత్‌తోనే ఆడింది. ఆ మ్యాచ్‌లో భారత్ కేవలం రెండు రోజుల్లోనే ఇన్నింగ్స్ 262 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఎనిమిదేళ్ల తర్వాత ఈ రెండు జట్లు మళ్లీ టెస్టు ఫార్మాట్‌లో తలపడబోతున్నాయి.

## ఇంగ్లండ్ టూర్‌కు వైభవ్?

ఐపీఎల్ 2026లో సంచలన ప్రదర్శనతో ఆకట్టుకున్న 15 ఏళ్ల యువ కెరటం వైభవ్ సూర్యవంశీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నుంచి బలమైన మద్దతు లభిస్తోంది. రాబోయే వైట్-బాల్ పర్యటన కోసం అతడిని జాతీయ జట్టులోకి వేగంగా తీసుకురావాలని సెలక్టర్లకు బీసీసీఐ పరోక్షంగా సూచించింది. వైభవ్ ప్రతిభను 'అసాధారణం' అని అభివర్ణించిన బోర్డు, అతని విషయంలో ఏది అవసరమో అది చేయాలని సెలక్టర్లకు స్పష్టం చేసింది. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ సూర్యవంశీ, ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. 16 మ్యాచ్‌లలో 237.31 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీలో అత్యధికంగా 72 సిక్సర్లు కొట్టడంతో పాటు 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్', 'ఎమర్జింగ్ ప్లేయర్' అవార్డులను కూడా గెలుచుకున్నాడు. అతని దూకుడైన బ్యాటింగ్ శైలితో, అతడిని వెంటనే జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# విమర్శలే పాలనా?

తెలంగాణలో ప్రభుత్వం మారి రెండేళ్లు పూర్తవుతున్నా, రాజకీయ వేదికలపై ఇంకా గత పాలన గురించే చర్చ ఎక్కువగా కనిపిస్తోంది. అధికారంలో ఉన్న నాయకత్వం తన పాలనా విజయాలు, భవిష్యత్ కార్యాచరణ, ప్రజలకు అందించిన ఫలితాల గురించి మాట్లాడాల్సిన సమయంలో, ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను విమర్శించడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందనే అభిప్రాయం ప్రజల్లో పెరుగుతోంది. ప్రజాస్వామ్యంలో గత ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపడం తప్పు కాదు. గత పాలనలో జరిగిన తప్పిదాలను ప్రజలకు వివరించడం కూడా ప్రభుత్వ బాధ్యతలో భాగమే. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరంతరం అదే అంశాన్ని రాజకీయ అజెండాగా మార్చుకోవడం వల్ల ప్రస్తుత సమస్యలు పక్కకు వెళ్లే ప్రమాదం ఉంది. ప్రజలు ఓటు వేసింది గతాన్ని తిట్టేందుకు కాదు, వర్తమానాన్ని మెరుగుపరచి భవిష్యత్తును నిర్మించేందుకు. రాష్ట్రంలోని రైతాంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. పంటలకు గిట్టుబాటు ధరలు, సాగునీటి నిర్వహణ, రుణభారం, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలు వంటి అంశాలు ఇప్పటికీ రైతుల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాల పెంపు, పరిశ్రమల విస్తరణ వంటి అంశాలపై స్పష్టమైన ఫలితాలు కనిపించాలని ప్రజలు కోరుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల సమస్యలు, పట్టణాల్లో ట్రాఫిక్, తాగునీటి కొరత, ధరల పెరుగుదల వంటి అంశాలు కూడా ప్రజల రోజువారీ జీవితాలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇవన్నీ పరిష్కరించాల్సిన సమయంలో రాజకీయ వేదికలపై కేసీఆర్ కేంద్రబిందువుగా మారడం ప్రజల్లో ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ఒక ప్రభుత్వ పనితీరును ప్రజలు ప్రతిపక్షంపై చేసిన విమర్శలతో కాకుండా, తమ జీవితాల్లో వచ్చిన మార్పులతో అంచనా వేస్తారు. రైతు ఆదాయం పెరిగిందా? యువతకు ఉద్యోగాలు వచ్చాయా? సంక్షేమ పథకాలు సమర్థంగా అమలవుతున్నాయా? అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయా? అనే ప్రశ్నలకే ప్రజలు సమాధానాలు కోరుకుంటారు. రాజకీయ విమర్శలు ఎన్నికల సమయంలో ఉపయోగపడవచ్చు. కానీ పాలనలో ప్రధాన లక్ష్యం ప్రజా సమస్యల పరిష్కారమే కావాలి. అధికారంలో ఉన్నవారు తమ శక్తి, సమయం, పరిపాలనా యంత్రాంగాన్ని గత ప్రభుత్వంపై విమర్శలకు కాకుండా ప్రస్తుత సవాళ్ల పరిష్కారానికి వినియోగించాలి. అప్పుడు మాత్రమే ప్రజలు పాలనలో మార్పును అనుభూతి చెందగలరు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాన్ని విమర్శించడం కంటే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం పెద్ద సవాలు. ఆ విశ్వాసం మాటలతో కాదు, ఫలితాలతో వస్తుంది. తెలంగాణ ప్రజలు కూడా ఇప్పుడు రాజకీయ ఆరోపణల కంటే పాలనా ఫలితాలనే ఎక్కువగా చూడాలనుకుంటున్నారు. కేసీఆర్‌ను విమర్శించడం ద్వారా కాదు, ప్రజా సమస్యలను పరిష్కరించడం ద్వారా మాత్రమే ప్రభుత్వం తన విజయాన్ని నిరూపించగలదు.



# ఏది విద్యావికాసం?

పిల్లల విద్య విషయంలో నేటి తల్లిదండ్రుల ఆలోచనలో ఒక సాధారణ అభిప్రాయం బలంగా కనిపిస్తోంది. అదే "ప్రైవేట్ పాఠశాలలో చదివితేనే మంచి భవిష్యత్తు" అనే నమ్మకం. అందుకే ఆర్థికంగా భారమైనా లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ స్కూళ్లలో పిల్లలను చేర్పిస్తున్నారు. కానీ నిజంగా ప్రైవేట్ బడి, సర్కార్ బడి మధ్య ఉన్న తేడా ఫీజుల్లోనా? లేక విద్యా నాణ్యతలోనా? అనే ప్రశ్నకు సమాధానం అంత సులభం కాదు. ప్రైవేట్ పాఠశాలలు ఆధునిక భవనాలు, ఆంగ్ల మాధ్యమ బోధన, సాంకేతిక సదుపాయాలు, ప్రత్యేక కోచింగ్, క్రమశిక్షణ వంటి అంశాలతో తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. మార్కులపై ప్రత్యేక దృష్టి పెట్టడం, పోటీ పరీక్షలకు చిన్న వయసులోనే సిద్ధం చేయడం వంటి విధానాలు కూడా ఉన్నాయి. అయితే వీటికి ప్రతిగా అధిక ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా ఖర్చులు కుటుంబాలపై అదనపు భారం మోపుతున్నాయి. ఇక ప్రభుత్వ పాఠశాలల విషయానికి వస్తే పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఇక్కడ విద్య ఉచితం. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు ప్రభుత్వం అందిస్తుంది. ముఖ్యంగా ఒక కీలకమైన అంశాన్ని చాలామంది గుర్తించరు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులు నిర్దిష్ట విద్యార్హతలు, శిక్షణ, అర్హత పరీక్షలు పూర్తి చేసిన వారే ఉంటారు. అంటే డిగ్రీలు, బీఈడ్, డీఈడ్ వంటి అర్హతలతో నియమితులైన ఉపాధ్యాయులే బోధన నిర్వహిస్తారు. అయితే కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. తక్కువ వేతనాలతో పనిచేసే ఉపాధ్యాయుల్లో కొందరికి పూర్తి స్థాయి బోధనా అర్హతలు లేకపోవడం కూడా కనిపిస్తుంది. అన్ని ప్రైవేట్ స్కూళ్లను ఒకే కోవలో పెట్టలేనప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అర్హతల విషయంలో ఉన్న ప్రమాణాలు మరింత కఠినంగా ఉంటాయి.

మన దేశంలో ఎన్నో మంది ఐఏఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. ఇది ఒక విషయాన్ని స్పష్టం చేస్తుంది. విజయాన్ని నిర్ణయించేది పాఠశాల భవనం కాదు, ఫీజుల పరిమాణం కాదు. బోధన నాణ్యత, విద్యార్థి కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల అంకితభావమే అసలు బలం. ఇటీవలి కాలంలో ప్రభుత్వాలు కూడా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఇంగ్లీష్ మీడియం బోధన, స్మార్ట్ టెక్నాలజీ, మెరుగైన మౌలిక సదుపాయాలతో సర్కార్ బడులు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మళ్లీ విశ్వాసం పెరుగుతోంది. అసలు చూస్తే ప్రైవేట్ బడి, సర్కార్ బడి మధ్య పోటీ కంటే విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ముఖ్యమైన అంశం. ఫీజులు ఎక్కువగా ఉండటం వల్ల విద్య నాణ్యత పెరుగుతుందని చెప్పలేం. అలాగే ప్రభుత్వ పాఠశాల అనగానే తక్కువ స్థాయి విద్య అని భావించడం కూడా సరైంది కాదు. సమాజంలో ప్రతి చిన్నారికి సమాన విద్యావకాశాలు కల్పించాలంటే ప్రభుత్వ పాఠశాలలు బలపడాలి. అదే సమయంలో ప్రైవేట్ పాఠశాలలు కూడా విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలి. చివరికి విద్యార్థి భవిష్యత్తు నిర్మాణమే రెండు వ్యవస్థల లక్ష్యం. ఆ లక్ష్యం నెరవేరినప్పుడే నిజమైన విద్యా వికాసం సాధ్యమవుతుంది.



**గుగ్గిళ్ల వెంకటేశ్**
ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్



## ప్రేమే దైవం

నయాగార జలపాతము నందు
వయ్యారంతో నువ్వు చేసే విందు
పంచుకుందామా నా ప్రియభామ
పెంచుకుందామా ఇక మన ప్రేమ!

గల గల పారేటి సెలయేళ్లు
మిల మిల మెరిసేటి నీకళ్ళు
నా ముందుకు వస్తున్నాయి
నీ విందును నాకిస్తున్నాయి !

నే కలల అలలపై ఇక తేలుతూ
నీ కలల కాంతులను ఏలుతూ
నా ప్రేమ సామ్రాజ్యాన్ని స్థాపిస్తా
నా శ్రమ సింహాసనాన్ని నీకు ఇస్తా!

నా ప్రేమలో నిన్ను ఇక ముంచేస్తా
నా అధరామృతాన్ని నీకు వంచేస్తా
నువ్వు గ్రోలుతూ నాతో ఉంటావు
నాప్రేమ తోపువు అని నన్నంటావు

నిన్ను నన్ను ఏకం చేసింది ఈప్రేమ
కన్ను మిన్ను కానక ఉండదు భామ
ప్రేమ వైనంనుకని మసులుకుందాం
ప్రేమే దైవమనిఇక తెలుసుకుందాం



**గుర్రాల లక్ష్మారెడ్డి కవి రచయిత**
**సెల్.9491387977. కల్వకుర్తి,**
**నాగర్ కర్నూల్ జిల్లా, తెలంగాణ**

# భావోద్వేగ రాజకీయం

రాష్ట్ర విభజన జరిగి పన్నెండేళ్లు దాటిపోయాయి. రెండు తెలుగు రాష్ట్రాలు తమ తమ అభివృద్ధి మార్గాల్లో ముందుకు సాగాల్సిన సమయంలో, కొన్ని రాజకీయ పరిణామాలు మళ్లీ తెలంగాణ ఆత్మగౌరవం, స్వాభిమాన భావోద్వేగాలను తెరపైకి తీసుకొస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకుల వ్యాఖ్యలు, నిర్ణయాలు, వ్యవహారశైలి తెలంగాణ సమాజంలో పాత గాయాలను గుర్తుచేస్తున్నాయనే భావన వ్యక్తమవుతోంది.



తెలంగాణ ఉద్యమం కేవలం పరిపాలనా విభజన కోసం జరిగిన పోరాటం కాదు. అది స్వయం పాలన, స్వీయ గౌరవం, ప్రాంతీయ అస్తిత్వం కోసం సాగిన దీర్ఘకాలిక ఉద్యమం. అలాంటి రాష్ట్రంలో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ఉద్యమ వీరులకు తగిన గౌరవం దక్కడం ప్రజల ఆకాంక్ష. ఈ నేపథ్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త అయిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఇప్పటికీ ట్యాంక్‌బండ్‌పై లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ, ఇతర ప్రాంతాల నాయకుల విగ్రహాలు మాత్రం కొనసాగుతున్నాయంటూ రాజకీయ నాయకులు ప్రశ్నలు లేవనెత్తడం మళ్లీ తెలంగాణ అస్తిత్వ చర్చకు దారితీస్తోంది. ఇదే సమయంలో కృష్ణా జలాల పంపకం, ప్రాజెక్టుల హక్కులు, ఉమ్మడి ఆస్తుల అంశాలు ఇప్పటికీ రెండు రాష్ట్రాల మధ్య వివాదాస్పదంగానే ఉన్నాయి. కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు న్యాయం జరగలేదన్న వాదనలు అప్పుడప్పుడు మళ్లీ బలపడుతున్నాయి. అసలు సమస్య ఏమిటంటే, కొన్ని ఏపీ రాజకీయ వర్గాలు ఇప్పటికీ తెలంగాణను సమాన భాగస్వామ్య రాష్ట్రంగా కాకుండా, పాత ఉమ్మడి రాష్ట్ర దృక్పథంతో చూడడం. రాజకీయ విమర్శలు సహజమే అయినా, తెలంగాణ ప్రత్యేకతను తగ్గించి మాట్లాడే ధోరణి కనిపించినప్పుడల్లా తెలంగాణ సమాజంలో ప్రతిచర్య సహజంగానే వస్తుంది. తెలంగాణ ఉద్యమం ముగిసినా, తెలంగాణ వాదం ముగియలేదని అలాంటి సందర్భాలు గుర్తు చేస్తున్నాయి. ఇది తెలంగాణ రాజకీయ పార్టీలకూ ఒక హెచ్చరికే. ప్రజల భావోద్వేగాలను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తు చేసుకోవడం కాకుండా, తెలంగాణ చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి, రాష్ట్ర హక్కుల పరిరక్షణ విషయంలో నిరంతర చిత్తశుద్ధి చూపాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ఏపీ పాలకులు కూడా రెండు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయ ప్రయోజనాల కోసం పాత ప్రాంతీయ వైరుధ్యాలను రెచ్చగొట్టడం ఎవరికీ మేలు చేయదు. కానీ ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణ భావజాలం బలహీనపడిందని భావించే ప్రతిసారీ, బయట నుంచి వచ్చే కొన్ని వ్యాఖ్యలు, చర్యలే దానికి కొత్త ఊపిరి పోస్తున్నాయి. తెలంగాణ వాదాన్ని తెలంగాణ రాజకీయ నాయకుల కంటే, కొన్నిసార్లు ఏపీ పాలకులే మరింత బలంగా తట్టిలేపుతున్నారనే వ్యాఖ్యలు అందుకే వినిపిస్తున్నాయి.

**- పవన్ కుమార్, అధ్యాపకుడు, వరంగల్**

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.